సూర్య

www.suryaa.com

ఆదివారం

24.11.2024



# కళల కాణాచి
# మన తెలంగాణ



# ఛైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**ఛైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**తెలంగాణ గట్టు మీద అరెస్ట్‌ల అంశం హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తారంటూ ఊహాగానాలు, వార్తలు, గాసిప్‌లు చక్కర్లు కొడుతోంది. నెల రోజులుగా ఆ ఎపిసోడ్ కంటిన్యూ అవుతోంది. ఇంతలోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ హీట్ క్రియేట్ చేస్తోంది . ఈ వ్యవహారంపై మీరేమంటారు సర్.**

**- ఎంజి రామకృష్ణ, హైదరాబాద్**

మీరు చెప్పినది నిజమే రామకృష్ణ గారూ... కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌లో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణను స్పీడప్ చేసింది. ఆరోపణలు, అక్రమాలకు సంబంధించి ఇప్పటికే పలువురు అధికారులను విచారించింది కమిషన్. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలపై విచారణ జరిపేందుకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ 21న మరోసారి హైదరాబాద్‌కు రాబోతుం దట. వచ్చే నెల 5 వరకు ఇక్కడే ఉండి పలువురిని విచారించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పీసీ ఘోష్ కమిషన్..మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు అప్పుడు ఇరిగేషన్ మిని స్టర్‌గా పనిచేసిన హరీశ్ రావును కూడా విచారణకు పిలుస్తారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ కొనుగోళ్ల ఇష్యూలోనే కేసీఆర్‌ను ఇరికించే ప్రయత్నం జరిగింది. అప్పుడు విద్యుత్ కమిషన్ నోటీసులు ఇస్తే మాజీ సీఎం విచారణకు హాజరుకాలేదు. అంతేకాదు జస్టిస్‌నరసిం హారెడ్డి కమిషన్‌కు విచారణార్హత లేదంటూ లేఖ రాశారు.న్యాయసూత్రాలకు విరుద్ధంగా కమిషన్‌ఏర్పాటైందని.. అలాంటి కమిషన్‌ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు కేసీఆర్. దాంతో ఏకంగా విచారణ కమిషన్ ఛైర్మన్ నే మార్చాల్సి వచ్చింది సర్కార్ కు. మరి ఇప్పుడు కాళేశ్వరం విషయంలో కేసీఆర్ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ పీసీ ఘోష్ కమిషన్ కేసీఆర్‌ను విచారణ పిలిస్తే వెళ్తారా.? కేసీఆర్ విచారణకు హాజరుకాకపోతే కమిషన్ ఎలా ముందుకు వెళ్తుం దనేది ఉత్కంఠ రేపుతోంది. కాళేశ్వరం విచారణ కమిషన్ నుంచి..ఈ నెలాఖరున కేసీఆర్‌కు పిలుపు రాబోతుందన్న ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ విచారణకు వెళ్లకపోతే అరెస్ట్ చేస్తారన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ అంత డేర్ చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తామని హంగామా చేసిన కాంగ్రెస్ఇప్పటికే డైలమాలో పడింది. లగచర్ల ఘటనలో కేటీఆర్ అరెస్ట్‌పై బ్యాక్ స్టెప్ వేసినా కాంగ్రెస్ పెద్దలు..ఫార్ములా ఈ రేస్ కేసులో గవర్నర్ అనుమతి రాగానే ఆయన్ను జైలుకు పంపుతామంటున్నారు. ఇంతలోనే కాళేశ్వరం విషయంలో కేసీఆర్ కార్నర్ చేసే ప్రయత్నం జరుగుతోంది.

**మెగా డీఎస్సీ వెంటనే ప్రకటిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన ఇంత వరకు ఎందుకు అమలు కాలేదు. ఆచరణలోకి ఎందుకు రాలేదు. కాస్త వివరంగా చెప్పండి సర్**

**కె. సువర్ణ కుమారి, విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నట్లు ప్రకటించింది. సీఎం చంద్రబాబు నాయుడు కూడా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సంతకాలు చేసిన తొలి ఫైళ్లలో డీఎస్పీ ఫైల్ ప్రధానమైంది. నిరుద్యోగులు ఎదురు చూడకూడదని, విద్యార్థులు చదువులు చెప్పే గురువులు లేక ఇబ్బందులు పడకూడదని, ప్రభుత్వం భావించి ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నట్లు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చాలా సభల్లో డీఎస్సీ విషయం ప్రస్తావిస్తూ టెట్ కూడా నిర్వహించారు.

టెట్ పరీక్షల సమయంలోనే డీఎస్సీ పరీక్ష కూడా నిర్వహిస్తున్నట్లు ముందుగా ప్రకటించిన ప్రభుత్వం ఆ ప్రకటనను వెనక్కి తీసుకుంది. ప్రస్తుతానికి టెట్ వరకు నిర్వహిస్తున్నామని, గతంలో టెట్ రాసి క్వాలిఫై అయిన వారు కూడా డీఎస్సీకి అర్హులేనని ప్రభుత్వం తెలిపింది. దీంతో ఏ క్షణంలో అయినా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని, నిరుద్యోగులు పట్టుదలతో చదివారు. టెట్ పరీక్ష చాలా కఠినంగా ఉందని, అటువంటిది డీఎస్సీ కూడా అంతకంటే ఎక్కువ కఠినంగా ఉంటుందనే భయం కూడా నిరుద్యోగుల్లో ఉంది.

ఎలాగైనా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టు సాధించాలని పట్టుదలతో చదివారు. దీని కోసం కొందరు నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లను కూడా ఆశ్రయించారు. వేలకు వేలు ఫీజులు చెల్లించారు. తీరా డీఎస్సీ ఇప్పట్లో లేదని నేరుగా విద్యా శాఖ మంత్రే సాక్షాత్తు అసెంబ్లీ సాక్షిగా వెల్లడించడం గమనార్హం. వేరే పనుల్లో ఉన్న చాలా మంది ఆ పనులు మానుకొని కేవలం డీఎస్సీ పరీక్షలపైనే కసరత్తు చేసినా చివరకు వారి కసరత్తుకు అర్థం లేకుండా పోయింది. భవిష్యత్ ఆశలు ఆవిరయ్యాయి. తిరిగి ప్రైవేటు పాఠశాలలు, ప్లే స్కూళ్లు వంటి చోట్ల టీచర్లుగా పని చేసేందుకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

డీఎస్సీ నోటిఫికేషన్ ఆలస్యానికి ఎస్సీ వర్గీకరణ ఒక కారణంగా పలువురు భావిస్తున్నారు. ఇటీవల వర్గీకరణ అమలు చేయడం కోసం ఏక సభ్య కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. అరవై రోజుల వ్యవధిలో నివేదిక సమర్పించాలని కమిషన్‌ను ప్రభుత్వం ఆదేశించింది. కమిషన్ ఎప్పటి నుంచి బాధ్యతలను స్వీకరిస్తుందో.. అప్పటి నుంచి అరవై రోజుల్లో నివేదిక ఇవ్వాలనేది ప్రభుత్వ ఆదేశాలు. ఈ కమిషన్‌కు కావలసిన కార్యాలయ సముదాయాన్ని చూడాల్సిన బాధ్యతను సాంఘీక సంక్షేమ శాఖకు అప్పగించారు. ఆ శాఖ ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్త లేదు. ఈ నెల ముగుస్తోంది. డిసెంబరు నెలలోనైనా కార్యాలయం ఏర్పాటు అవుతుందా లేదా అనే అనుమానాలు చాలా మందిలో ఉన్నాయి. కమిషన్ సిఫార్సులు అందిన తర్వాత ప్రభుత్వం పరిశీలించడానికి కొంత సమయం తీసుకుంటుంది. ఆ సిఫార్సులు అమలు చేసేందుకు కూడా సమయం పట్టే అవకాశం ఉంది. అంటే వచ్చే విద్యా సంవత్సరానికైనా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం లభిస్తుందా లేదా అనేది కూడా చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.

# లెజెండ్

## గీతాంజలి



(గత **వారం తరువాయి**)

దాంతో పుల్లయ్యగారు 'మురళీకృష్ణ' చిత్రంలో అవకాశం ఇచ్చారు. ఈ చిత్రంలో నాది ఓ వెరైటీ పాత్ర. డిప్రెషన్‌లో ఉండే మెంటల్లీ రిటార్టెడ్ పాత్ర. అక్కినేని, జమున గార్ల కాంబినేషన్‌లో నేను కూడా ఎంతో బాగా నటించాను. ఈ చిత్రంలో పాటలన్నీ హిట్. సినిమా సూపర్ హిట్. దాంతో అది నా కెరీర్‌కు ఒక మలుపుగా ఉపయోగపడింది.

**గీతాంజలిగా పేరు మార్పు :** 'పారస్‌మణి' అనే హిందీ చిత్రంలో నేను హీరోయిన్‌గా నటించాను. ఈ చిత్రానికి దర్శకులు బాబూభాయ్ మిస్త్రీ. చిత్రంపేరు పారస్ మణి. అందులో నా పేరు మణి. నా అసలు పేరు కూడా మణి కావడం కూడా వారికి నచ్చలేదో.. ఏమో... నాకు గీతాంజలి అని పేరు పెడితే ఎలా ఉంటుంది? అని ఆయన అడిగారు. ఎందుకో నేను 'మీ ఇష్టం అండీ' అనేశాను. అంతే. అప్పుడే అగ్రిమెంట్‌లో గీతాంజలి అని రాశారు. ఇక అప్పటి నుండి నేను చిత్ర పరిశ్రమలో గీతాంజలిగానే చలామణీ అవుతూ వచ్చాను.

అదేవిధంగా చంద్రకాంత్‌భాయ్ దర్శకత్వంలో 'బలరామకృష్ణ' అనే హిందీ పౌరాణిక చిత్రంలో రుక్మిణీ పాత్రలో నటించాను. ఇది నా రెండవ హిందీ చిత్రం. ఇందులో ధారాసింగ్ బలరాముడు. సావిత్రి ధారాసింగ్ భార్యగా నటించింది. కృష్ణుడుగా షాహమోడక్ నటించారు. ఇందులో నేను సావిత్రి, అక్కాచెల్లెళ్ళుగా నటించాం. షూటింగ్‌లో మేం ఎంతో ఎంజాయ్ చేసేవాళ్ళం. జైపూర్ తదితర ప్రాంతాలన్నీ తిరిగి చూశాం. ఈ చిత్రం విడుదలయ్యాక బంపర్ కలెక్షన్లు సాధించింది.

**హాస్య పాత్రలు :** నేను కథానాయికగా రాణిస్తున్న మంచి తరుణంలో ఎన్.టి.రామారావుగారి 'దేవత' చిత్రంలో నటించమని అడిగారు. అందులో నాది హాస్య పాత్ర. నేను ఏ పాత్ర అయినా బాగా చేస్తాననే ఉద్దేశంతో వాళ్ళు నన్ను సంప్రదించారు. కానీ అక్కడ మాత్రం నా స్టెప్ కొంచెం రాంగ్‌గానే పడిందని చెప్పాలి. ఆ పాత్ర చేయాలని చాలా రిక్వెస్ట్ చేశారు. 'ఈ గీతాంజలి వ్యాంప్‌గా చేస్తుంది, హీరోయిన్‌గా చేస్తుంది, ఇక హాస్య పాత్రల్లో కూడా చేయగలదనే విషయాన్ని నిరూపించుకో, అనేది సవాల్‌గా నాకు ఎదురు కావడంతో ఆ పాత్రకు అంగీకరించాను. ఇలా దేవత చిత్రం హిట్ కాగా అందులో నా పాత్ర బంపర్ హిట్ అయింది. ఈ చిత్రం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది.

ఈ చిత్రంలో నేను, పద్మనాభం గారు నటించిన 'మా ఊరు మదరాసు నా పేరు రాందాసు/మా ఊరు బొంబాయి నా పేరు రాధాబాయి' అనే పాట ప్రేక్షకుల నాలుకలపై ముద్రపడిపోయింది. ఆ విధంగా హాస్య పాత్రల్లోకి చొరబడ్డాను.

చలంగారి చిత్రం 'సంబరాల రాంబాబు'లో కూడా హాస్య పాత్ర పోషించాను. 'పొరుగింటి మీనాక్షమ్మను చూశారా, వాళ్ళ ఆయన చేసే ముద్దూ ముచ్చటా విన్నారా..." అనే పాట తెలుగు రాష్ట్రంలో ఎంతో పాపులర్ అయింది. దాంతో నన్ను మంచి హాస్య నటిగా ప్రేక్షకులు గుర్తించారు. ఇలా హాస్య పాత్రల్లో కూడా నేను రాణించడం ప్రారంభించాను. నేను ఎక్కువ పద్మనాభంగారి పక్కనే హాస్య పాత్రల్లో నటించాను. కొన్ని చిత్రాల్లో నగేష్‌తో నటించాను. ఇతర నటులతో నటించలేదు.


**హీరోయిన్‌గా..:** ఇప్పటివరకు హిందీ, తెలుగు, తమిళ భాషల్లో దాదాపు 300 చిత్రాల పైచిలుకు నటించాను. వీటిల్లో హాస్యం, వ్యాంప్, హీరోయిన్ అన్ని పాత్రలూ ఉన్నాయి. రణభేరి, రాజయోగం, పంతాలు పట్టింపులు, తోటలోపిల్ల కోటలో రాణి, రైతేరాజు, హంతకులొస్తున్నారు జాగ్రత్త'. ప్రస్తుతం విజయచందర్ పక్కన రంగనాథ్‌గారు, నేను, గిరిబాబుగారు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా చేస్తున్నాం.

**నాకు నచ్చిన నా చిత్రాలు :** నేను నటించిన చిత్రాలు అన్నీ ఆల్మోస్ట్ హిట్ చిత్రాలే. ఇల్లాలు, పంతాలు-పట్టింపులు, అబ్బాయి గారు-అమ్మాయిగారు, మర్యాద రామన్న, అవే కళ్ళు, పొట్టిప్లీడర్, దేవత, సంబరాల రాంబాబు, తోడూనీడా, లోగుట్టు పెరుమాళ్ళకెరుక, హంతకులొస్తున్నారు జాగ్రత్త, హిందీలో సూపర్‌హిట్ చిత్రం 'బలరామకృష్ణ', బాబుభాయ్‌మిస్త్రీ చిత్రం 'పారస్‌మణి'. దీనికి లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీతం సమకూర్చారు.

**క్యారెక్టర్ నటిగా, సీరియల్స్‌లో బీ** ముఖ్యంగా నేను మా బాబు శ్రీనివాస్ కోసం హైదరాబాద్ వచ్చాను. భూమా, రంగుల కలలు, కోయిల, ఆకాష్ (ఇందులో ముగ్గురు హీరోల్లో మా అబ్బాయి ఒకడు) వాడు హీరోగా నటించిన చిత్రాలు. ఎలాగూ హైదరాబాద్ వచ్చాను కదా అని డైరెక్టర్లు అడగడంతో అటు సినిమాలు, ఇటు సీరియల్స్ కూడా ఒప్పుకున్నాను. కోటగారి కాంబినేషన్‌లో 'పెళ్ళైన కొత్తలో', 'ఆలయం', ముత్యాల సుబ్బయ్య గారి 'యకరం యాభై కోట్లు', 'నేరము-శిక్ష' ఈ మధ్యలో వచ్చిన 'గోపి, గోపికా, గోదావరి, ఢమరుకం, గ్రీకువీరుడు చిత్రాల్లో నటించాను. **(మిగతా వచ్చేవారం)**

# నవ కవిత్వం

## బతకొద్దు జీవించండి




మన జీవిత కాలం
మన చేతుల్లో ఉండదు
మనం జీవించిన కాలం
మన చేతుల్లో ఉంటుంది
బతకటం వేరు జీవించడం
వేరు బతకటంలో ప్రాణం
మాత్రమే ఉంటుంది
జీవించడంలో సంతృప్తి,
అనభూతీ సంతోషం
త్యాగం ఉంటుంది.
బంగారాన్ని ఎన్ని
ముక్కలు చేసినా
దాని విలువ తగ్గదు
సమాజ హితం
కోసం బతికిన వారిని
సమాజం మరిచిపోదు
అలాగే మంచితనంతో
సంపాదించుకున్న
గౌరవంకూడా ఎప్పటికీ
తరిగిపోదు ప్రాణం
పోయినప్పుడుముగిసిజి
పోయేది జీవిత కాలం
ఆశయాల కోసం బతకడం
వాటి సాధనకై కృషి
చేయడంసమాజంలో
నిన్ను శక్తిగా నిలుపుతుంది
పరోపకారం సహాయం
సమన్వయం సహనం
నీ వ్యక్తిత్వానికి
వెలుగు నిస్తుంది
నీ నిస్వార్థ సమాజ
సేవా ఉత్తమ
సమాజానికిజి
పునాది వేస్తుంది
ఇతరులకుస్ఫూర్తి
అవుతుంది
నిరాశ నిస్పృహల్లో
జీవితాన్ని సాగదీయకు
విలువైన సమయాన్ని
వృధా చేయకు
పేరుకు మాత్రమే
బతుకడం మానుకో
మంచిని పెంచి
మంచిని పంచే
మహా శక్తిగా ఎదగాలి
పరుల అభివృద్ధికి
పాటుపడే మనిషే
అసలు మనిషి
మానవీయతజి
పునాదుల మీధ
బతికిన బతుకే
అసలైన జీవితం

**నేదునూరి కనకయ్య**
**9440245771**

# లేఖలు

**ముఖచిత్ర కథనం ఘంటం నుంచి కలం వరకు మారిన పెన్నుల గురించి అనేక కాల క్రమణ పరిణామాలను సుస్పష్టంగా విపులంగా వివరణాత్మకమైన వ్యాసం అందించిన రచయితకు ధన్యవాదాలు**ప్రత్యేక కథనాన్ని ఆదివారం అనుబంధంలో ప్రచురించడం బాగుంది. అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నాము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**




**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**


# అందాజు!!




క్షణాల రథంలో
వేగపు యుగంలో
సహజీవుల సాహచర్య సమ్మేళనలో
సాగిపోతు!
డాక్టరు యాక్టరును
ప్లీడరు లీడరును
రకరకాల రంగాల్లో రాణించెడి రణ-
ధీరులు!
ఓరేయినజూడ
రక్కసల్లెనొకటి
కల్లింతగ కాళ్లంతగ గోళ్ళంతగ
గోచెరించె!
కన్నులు నలుపుకొని
వెన్నులు చరుచుకుని
మరలమరల తిరిగితిరిగి తీక్షణంగ
వీక్షించీ!
భూతమె ప్రేతమే
రక్తము రుచిజూడు
రాకాసిది, రాబందుల బంధువని
రంకెలేసిరి!
ఒడలు జలదరించి
హడలి పరితపించి
బడలికతో పరుగెడుతూ ఎడమునకు
వెడలసాగిరి!
రవియుజూడవచ్చెజి
నిశిజడిచిదాక్కొనె
నిజానిజాలు నికరమాయె మాయపొర
మాయమాయె!
కళ్ళము పంటపై
నల్లటి కప్పుపై
గువ్వజంటలాటలు రక్కసిమోము
తీరనుపించె!
తీరుతెన్ను తెలియక
తీరును తూచడం
అన్నివేళల అనూహ్యం అర్ధరహితం
అపాయం!

**– రవి కిషోర్ పెంట్రాల, లాంగ్లీ, లండన్!**

ఫన్ చ్







సూర్య బుడత

బాలల కథ



# గురు బ్రహ్మ గురు విష్ణు శ్లోకం మూల కథ



గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వరః%ొ%ఈ శ్లోకం వెనుక మనందరం తప్పక తెలుసుకోవలసిన ఒక స్ఫూర్తిదాయకమైన పురాణ కథ ఉన్నది. ఆ కథ ఏమిటో ఇప్పుడు మనం తెలుసు కుందాం.పూర్వం కౌత్సుడు అనే పేద విద్యార్థికి విద్యాధరుడు అనే గురువు గారు తన ఆశ్రమంలో ఆశ్రయమిచ్చి తనకు తెలిసిన అన్ని విద్యలు నేర్పేవాడు. ఒకసారి గురువు గారు కౌత్సుడికి ఆశ్రమ బాధ్యతను అప్పగించి పని మీద కొన్ని రోజులు బయటకు వెళతాడు. గురువు గారు తిరిగి వచ్చేవరకు కౌత్సుడు ఆశ్రమాన్ని చక్కగా చూసుకుంటాడు.

గురువు గారు తిరిగివచ్చిన కొన్ని రోజులకు కౌత్సుడి చదువు పూర్తవుతుంది. కౌత్సుడిని తీసుకెళ్లాడానికి తల్లిదండ్రులు వస్తారు. కానీ కౌత్సుడు తాను గురువు గారి దగ్గరే ఉంటానని ఇంటికి రానని ఖరాఖండిగా చెప్పి తల్లిదండ్రులను వెనక్కి పంపిస్తాడు. వాళ్ళు వెళ్లిన తరువాత గురువు గారు కౌత్సుడు తల్లిదండ్రులతో వెళ్లకపోవడానికి గల కారణం అడుగుతాడు. అప్పుడు కౌత్సుడు గురువు గారితో "గురువు గారూ మీరు కొన్ని రోజుల క్రితం బయటకు వెళ్ళినపుడు మీ జాతకం చూసాను. మీరు సమీప భవిష్యత్తులో భయంకరమైన రోగంతో ఇబ్బంది పడతారని ఉంది. అందుకే మిమ్మల్ని వదిలి వెళ్లలేను." అని చెబుతాడు.

కొన్ని రోజులకు గురువు గారికి క్షయ రోగం వస్తుంది.ఆ కాలంలో క్షయకు చికిత్స లేకపోవడంతో కాశీకి వెళ్లి దాన ధర్మాలు, పుణ్య కార్యాలు చేయాలని గురుశిష్యులు కాశీకి వెళతారు. గురువుగారి రోగం చూసి కాశీ ప్రజలు వీళ్ళను అసహ్యించుకుంటారు. కానీ కౌత్సుడు గురువు గారికి సేవలు చేస్తూనే ఉంటాడు.ఎంతోమంది గురువు గారిని వదిలి వెళ్ళమని సలహా ఇచ్చినప్పటికీ కౌత్సుడు మాత్రం గురువు గారిని వదిలి వెళ్ళటానికి ఇష్టపడడు.

కౌత్సుడి గురు భక్తికి మెచ్చిన త్రిమూర్తులు అతన్ని పరీక్షించాలనుకు ఉంటారు. మొదట బ్రహ్మ మారువేషంలో వెళ్లి గురువుని వదిలేయమని సలహా ఇస్తాడు. కౌత్సుడు బ్రహ్మ చెప్పిన మాటలు వినడు. మరలా విష్ణువు మారు వేషంలో వచ్చి సలహా ఇచ్చినా కూడా కౌత్సుడు వినడు. చివరికి పరమేశ్వరుడు వచ్చి చెప్పినా కూడా వినడు. అతని గురుభక్తిని మెచ్చి పరమేశ్వరుడు ఏదయినా సహాయం కావాలా అని కౌత్సుడిని అడుగుతాడు. మరెవరూ గురువును వదిలేయమనే సలహా ఇవ్వడానికి రాకుండా కాపలా కాయమని మారువేషంలో ఉన్న పరమశివుడికి చెబుతాడు కౌత్సుడు.

అపారమైన కౌత్సుడి గురుభక్తికి సాక్షాత్తు ఆ త్రిమూర్తులే అతని ఎదుట ప్రత్యక్షమవుతారు. కౌత్సుడికి మోక్షం ఇస్తాం అంటారు. అప్పుడు కౌత్సుడు వారితో నాకు మీ గురించి చెప్పి ఈ రోజు మీరు ప్రత్యక్షం కావడానికి కారణమైన నా గురువే నాకు బ్రహ్మ, నా గురువే నాకు విష్ణువు, నా గురువే నాకు మహేశ్వరుడు. మీరు సాక్షాత్కారం అవడానికి కారణమైన నా గురువే నాకు పరబ్రహ్మ అని అర్థం వచ్చేలా ఒక శ్లోకం చెప్పి, తన గురువు గారికి మోక్షం ప్రసాదించమని త్రిమూర్తులను వేడుకుంటాడు. కౌత్సుడి గురుభక్తికి అబ్బురపడిన త్రిమూర్తులు గురువుగారికి మోక్షం ప్రసాదిస్తారు.ఆనందంతో కౌత్సుడు తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోతాడు.

గురు శిష్యుల అనుబంధం ఎంత విశిష్టమైనదో, దైవికమైనదో మనకు తెలియజేస్తున్నఈ కథలో కౌశ్యుడు త్రిమూర్తులకు చెప్పిన ఆ శ్లోకమే

**గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వరః**
**గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువే నమః**



## వేమన పద్యాలు

ఎలుకతోలు దెచ్చి యేడాది యుతికిన
నలుపు నలుపే కాని తెలుపు గాదు
కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన బలుకునా
విశ్వదాభిరామ వినుర వేమ

తా. ఎలుకతోలు అదేపనిగా సంవత్సరం పాటు ఉతికినా తెల్లబడదు.అదేవిధంగా కొయ్యబొమ్మను కొట్టినా మాట్లాడదు.



| | | | | | |
|---|---|---|---|---|---|
| | | 5 | 3 | | 1 |
| | 3 | 4 | | | |
| | 6 | | | 5 | 3 |
| 3 | 5 | | | 6 | |
| | | | 5 | 3 | |
| 5 | | 3 | 2 | | |

## ఈవారం కథ

# ఇలాంటి వారు ఉంటారా?



ఇది బరువెక్కిపోయిన గుండెతో చెప్పిన మాట. మనుషులు మారిపోయారు , మమతలు దూరమయ్యాయి అనడం ఒట్టి అపద్దం.మనుషుల మధ్య బందువుల మధ్య బంధాలు, అనుభందాలు లేని ఈ కాలంలో ఒక పెద్దాయన దేనిపైన బంధం పెంచుకున్నారో చెబితే మీరే ఆశ్చర్య పోతారు. ఇంకా అలాంటి వ్యక్తులు ఉన్నారా అని ఆలోచిస్తూ మీ ఊర్లో కూడా అలానే బ్రతికే మరొకరిని కచ్చితంగా తలుచుకుంటారు.

ఇవన్నీ నేను వేదంతంగా చెప్పలేదు.నేరుగా చూసినది, చెవులారా విన్నది మాత్రమే చెబుతున్నా. నా పేరుసూర్యనారాయణ శర్మ. మాది వేదాంతం అగ్రహారం. నేను ఈ ఊరికి పురోహితున్ని మాత్రమే కాదు హితాన్ని కూడా కోరే వాణ్ణి.

మా ఊళ్ళో ఉన్నది ఒకే ఒక శివాలయం . అది చాలా పురాతనమైనది .పూజలు పునస్కారాలు చేసే వారి మొదలు రెండు చేతులెత్తి ఒక్క నమస్కారంతో దైవానుగ్రహం పొందాలి అనుకునేవారు అందరూ అక్కడికి వస్తుంటారు. అందరినీ శివయ్య ఒకేలా చూస్తుంటాడు.

ఒకప్పుడు వేద పాఠశాల నడిపిన శ్రీ శ్రీ రామనాథ శాస్త్రి గారు గుడికొచ్చి ఎక్కువ సేపు అక్కడే గడిపే వారిలో ఆయన ప్రథముడు.సరదాగా అందరితో కబుర్లు చెప్పి కాలక్షేపం చేసే మనిషి కాదు ఆయన.

ఆయనకు ఇద్దరు కొడుకులు ఒకరు అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్, మరొకరు పొరుగు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగి.

ఇద్దరికీ తలొక పై పంచ వేసేశాడు.ఇద్దరు ఎవరి కాళ్లపై వాళ్ళు నిలబడ్డారు.ఈయన వేదపాఠశాల నడిపి అందులో వచ్చిన డబ్బుతో కాదు పిల్లలను చదివించింది.ఈయన దగ్గర నేర్చుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ రాష్ట్రంలో వేరు వేరు ప్రాంతాలలో పేదరికంలో ఉన్న వారే.

చదవాలన్న ఆకాంక్ష,ఆతృత ఉన్నవాళ్ళందరినీ ఆయన చేర్చుకొని ఉచితంగా భోజనం ,వసతి కల్పించి మరీ అక్కడే విద్య నేర్పించేవాడు.కొడుకులు కూడా ఒక్క నయాపైసా తండ్రి దగ్గర ఖర్చు పెట్టించ కుండా గవర్నమెంటు పాఠశాలలో చదివిన వారే.

"ఇంతమంది పిల్లలకు వేదం నేర్పుతున్నాను.మీలో కనీసం ఒక్కడైనా నేర్చుకోండిరా " అని ఆయన ఏనాడూ వాళ్ళను అడగలేదు.

వాళ్లకు నేర్చుకోవాలన్న శ్రద్ధ ఉంటే వాళ్ళే వస్తారని ఆయన నమ్మకం.ఆయన భార్య అన్నపూర్ణ . నిజంగానే పేరుకే కాదు సాక్షాత్తు అన్నపూర్ణే.ఆకలితో ఎవరినీ, అరకడుపుతో మరెవరినీ ఉంచదు.అమ్మా నాన్నలు లేని లోటు ఆ పాఠశాలలో విద్యార్థులకు ఏమాత్రం తెలియకుండా చేసేది.

ఇక పాఠశాల నడపడానికి ఆ ఊర్లో మాన్యం భూమిపై వచ్చే సంపాదనను వినియోగించుకునేవాడు.మాన్యం భూమిలో ధాన్యం విరివిగా పండేవి. మరి కొంత భాగంలో ఆకుకూరలు కూరగాయలు పండించేవాడు. కౌలుకిచ్చి ,పాఠశాల తో పాటు కుటుంబం కూడా నడపగలిగేంత పంటనిచ్చే మాన్యాలు అవి.

ఆయనకు ఎప్పుడూ ఆ పొలాల పైన వచ్చే సంపాదన తన కుటుంబం కోసం కొంత దాచుకుందామని ఏనాడు అనిపించలేదు ఏమో అది ఆయన మనస్తత్వం.

నేను ఇందాక మొదట్లో అన్నాగా ఒక్కొక్కరికి ఒక్కొక్క ఆలోచన అని, అవి మంచి కావచ్చు చెడు కావచ్చు అన్నట్టు రెండు పుట్టేవి మనిషి మెదడు నుండే కదా.

భూములపై మనుషులకు విపరీతమైన ఆశ మొదలైంది. ఊరిలో పేరు మోసిన పెద్దలు, తెల్లచొక్కా లేసిన పెద్దలు , టక్కులు చేసిన మరికొందరు ,బాగా చదువుకున్నోళ్లు అందరూ కలిసి ఊళ్లో ఉన్న మాన్యాలని ప్రభుత్వం తీసుకొని ఊర్లోని పేదలకు పంచమని పంచాయితీ చేసి అందులో తలో చేయి వేసి తాము పేదోళ్లు అనిపించుకున్నారు.

ఎదిరించే ధైర్యం లేదు ఎదురు తిరిగి నిలబడే స్థాయి ఆయన దగ్గర లేదు. దీంతో ఉన్న భూములన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే దానిపై వచ్చే ఆదాయంతో నడిపేపాఠశాలను శాశ్వతంగా మూసేశాడు. కానీ దానిపై ఉన్న మమకారం వదులుకోలేక ఒక్క విద్యార్థిని మాత్రం చేర్చుకుని వారిని గుడికి తీసుకొచ్చి ఇక్కడే పెద్ద మఱ్ఱి చెట్టు కింద కూర్చోబెట్టి పాఠం చెబుతుంటారు.

***

ఉన్నట్టుండి ఊర్లో పెద్ద వరద వచ్చింది.వర్షం మొదలై మూడు రోజులైంది వానజడి ఏమాత్రం ఆగడం లేదు. పక్కనే ఉన్న అన్ని పిల్ల కాలవల మొదలు వాగులు వంకలు అన్ని ఒక్కొక్కటిగా ఊరిని చుట్టుముట్టేస్తున్నాయి.ఉరుముల శబ్దాలు ఎవరికీ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

మెరుపుల వెలుతురులు చిమ్మ చీకట్లో భయాన్ని వెతికి బయటపడేస్తున్నాయి. చిన్న ధారలా వచ్చిన వరద పెరిగి పెద్దదైన నీళ్ల ధాటికి ఇళ్లన్నీ , సామాన్లన్నీ, ఒక్కొక్కటిగా కొట్టుకుపోయాయి. మొండి గోడలు మాత్రం మాకేం సంబంధం లేనట్టు నిల్చున్నాయి. ఇక గ్రామంలోని వారందరూ ఒట్టి చేతులతో శివయ్య ఉన్న చోటుకు వచ్చి ప్రాణాలు నిలబెట్టుకున్నారు.

అంతా మాయలా జరిగిపోయింది. బీద –సాదా, రాజు– ధనిక అందరూ ఒకటై పోయారు.ప్రాణనష్టం జరగలేదు కానీ ఆస్తి నష్టం అపారం. అది విలువ కట్టలేనిది. నిజంగా ముసలి ముతక బయటపడ్డారంటే మాత్రం అదృష్టమనే చెప్పాలి.ఇది జరిగిన మరుసటి రోజు అందరికీ భయం పట్టుకుంది. ఇక ఇక్కడే ఉంటే ఇలానే మనం ప్రతిసారి బయటపడలేం కదా అని అందరిలో మెదులుతుంది. ఎవరి పాటకి వాళ్ళు ఊరు వదిలి వేరే చోటుకు వెళ్లాలని నిర్ణయాలు తీసుకుంటున్నారు. రామనాథ శాస్త్రి గారి ఇద్దరు పిల్లలు కూడా "ఇకమీద ఇక్కడ ఉండటం ఏమాత్రం క్షేమం కాదు . అక్కడ మమ్మల్ని అందరూ నానా మాటలు అంటున్నారు. మీరు ఇంత స్థాయిలో ఉండి మీ అమ్మానాన్నలను గాలికి వదిలేసారని పెద్ద మాటలతో ఎత్తి పొడుస్తున్నారు.ఇన్ని రోజులు మేము కూడా ఇది అంత శ్రద్ధగా చెవికెక్కించుకోలేదు.కానీ ఈరోజు జరిగిన పరిస్థితి చూస్తే ఈ విషయంలో మీకు ఏదైనా జరిగి ఉంటే అందరూ అన్నట్టుగానే మేము జీవితాంతం దోషులుగా మిగిలిపోయే వాళ్ళం" అంటూ మా ఇద్దరిలో ఎవరి వద్దనైనా సరే వచ్చి ఉండమని బలవంతం చేశారు.

"కానీ రామనాథ శాస్త్రి మాత్రం నాకు కొన్ని రోజులు సమయం ఇవ్వండి "అని చెప్పి వాళ్ళ బాధ అర్థం చేసుకుని ఒక నిర్ణయం తప్పక తీసుకుంటానని చెప్పారు. దీంతో అన్ని వసతులు మళ్ళీ కల్పించి ఇద్దరు వారికి కాస్త సమయం ఇచ్చి వెళ్లారు.ఒకవైపు అన్నపూర్ణమ్మకు కూడా దిగులు చుట్టుకుంది.వయసు మీద పడుతుంది కదా జరగరానిది జరిగితే ఇక్కడ దిక్కు ఎవరు. ఇంకా ఇక్కడ మనం ఎవరున్నారని ఉండాలి అంటూ దిగులు చెందుతోంది.

***

ఒకరోజు సాయంత్రం రామనాథ శాస్త్రి ఎప్పటిలాగే శివాలయం కు వచ్చారు.అందరూ భక్తులు అప్పటికే వచ్చి వెళ్లారు.ఒంటరిగా నంది పక్కన కూర్చున్న ఆయన శివయ్య అడ్డ విభూది నామాల మధ్యలో ఉన్న ఎర్రటి కుంకుమ తిలకాన్ని తదేకంగా చూస్తున్నారు.

ఓవైపు బయట అంతా చల్లని గాలులు వీస్తుంటే రాతి గోడల మధ్య నిర్మించిన శివాలయంలో మాత్రం గోరువెచ్చదనం ఒంటికి తగులుతుంది.కళ్ళతో మెల్లగా మనసులో మాటలు చెబుతున్నారు రామనాథశాస్త్రి "ఏమయ్యా మా అమ్మానాన్న ఇదే మట్టిలో పుట్టి ఇదే నీళ్లు తాగి ఇదే గాలి పిలుస్తూ ఇక్కడే ప్రాణం ఉన్నంతకాలం హాయిగా ఉండి చనిపోయారు.

నేను పుట్టి పెరిగింది ఇక్కడే మా నాన్న చేయి పట్టి నడక నేర్పిందిఇక్కడే, మా అమ్మ చేతి రుచి చూసింది ఇక్కడ పండిన పంటతోనే, నాకు అబ్బిన ఈ వేద విద్య నీ ముందర కూర్చోబెట్టి మా నాన్న నేర్పిందే కదా. అందరూ వేరే ఊర్లలో ఉంటున్నారు కదా అని, ఇక్కడ ప్రమాదం పొంచి ఉందని ,సరైన సౌకర్యాలు లేవని అనేక సాకులతో అందరిలాగా నన్ను కూడా ఈ ఊరు వదిలి వెళ్ళిపోమంటావా? లేక నాకొన ఊపిరి వదిలే దాకా ఇక్కడే ఉండమంటావా" నువ్వే చెప్పు..

అయినా నాక్కూడా ఈ ఊరిలో నీతో ఉన్నది కేవలం లౌకిక బంధం కాదు అది అలోకికం చెప్పలేనిది , చెప్పిన ఎవరికీ అర్థం కానిది .

ఒకరికి భార్య మీద , మరొకరికి కొడుకుల మీద, ఇంకొకరికి అన్నదమ్ములు – అక్క చెల్లెల మీద , మరో పక్క స్నేహితులు, ఆస్తులు – పాస్తులు ,డబ్బు అనేక వాటిపై బంధాన్ని ఏర్పరచుకొని ఉంటారు.అలాగే నాకంటూ ఒక బంధం ఉండకూడదా? అది కేవలం అందరికీ నచ్చేదై ఉండాలా? నాకు ఇక్కడ ఉండడం అంటే ఇష్టం .నా అన్న ప్రదేశంలో ఎంత హాయిగా ఉంటుందంటే ఓ పూట అన్న పానీయాలు లేకపోయినా అలసట తెలియనంత .అయినా నీకు తెలియనిదా చెప్పు నాకు ఇక్కడ ఏ రోజైనా కాస్తయినా సుస్థి చేసిందా చెప్పు?నీతో ఉన్న అనుబంధం ఎలాంటిది? నువ్వు సర్వాంతర్యామివి అన్ని నువ్వే , అన్ని చోట్ల నువ్వే కానీ నిన్ను ఇక్కడ ఇలా చూస్తుంటే నాకు ఎంత ఆనందము ఉంటుందో నీకు తెలియదా చెప్పు? ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

మొదటిసారి మనసులో ప్రశ్నల వర్షం కురుస్తుంది. ఒకింత కలవరింతగా ఉంది. అలజడి కాస్త జడివాన పట్టుకున్నట్టు పట్టుకుంది. ఏం చేయమంటావు" అంటూ మాట్లాడుతున్నాడు.

మధ్యలో వచ్చిన నేను ' అయ్యా , ఇక సెలవు తీసుకుందామా స్వామికి ఏకాంత సేవ చేయాలి" అన్నాను. వారి మధ్యన కలిగిన అసౌకర్యానికి మనసులో చింతిస్తూ.

"ఓ తప్పకుండా స్వామి" అన్నారు వారు.ఆయన తీర్థం పుచ్చుకుని , శఠరి తలపై పెట్టించుకొని , ఓ పువ్వు స్వామి వారి ప్రసాదంగా తీసుకొని ఇంటికి బయలుదేరారు.

ఇంటికెళ్ళి పువ్వు అన్నపూర్ణమ్మ చేతికిచ్చి జడలో పెట్టుకోమన్నారు.కడుపునిండా భోజనం చేసి,తాంబూల చర్వణం చేశారు. ప్రశాంతంగా రాగి మరచెంబులో నీళ్ళు పక్కన పెట్టుకొని ఎప్పటి లాగే నాలుగు దేవుని శ్లోకాలు చదువుకుంటూ పడుకున్నారు.

తెల్లారి సూర్యుడు రాక మునుపే అన్నపూర్ణమ్మ లేచి ఇంటి ముందు కసువు తోసి ముగ్గు పెట్టి , స్నానం చేసి, తులసి చెట్టుకు నీళ్ళు పోసుకొంది.ఈ సమయానికి ఆయన కూడా నిత్య కాల కృత్యాలు తీర్చుకొనే వారు.

ఇంకా మగతగా పడుకున్నట్టు ఉన్నారు.

దగ్గరికెళ్ళి ఎంత బిగ్గరగా పిలిచినా , ఎంతో గట్టిగా చేతితో తట్టినా చలించలేదు. ఆయన ఏమాత్రం మౌనం వీడలేదు.నిన్న ఆయన శివుణ్ణి అడిగిన ప్రశ్నలన్నింటికీ తెరపడింది.ఇంకెవరినీ ప్రశ్నించలేనంత దూరం వెళ్ళిపోయారు. ఎవరి ప్రశ్నలూ వినలేనంత నిశబ్దం పాటించారు.ఇదంతా చూసిన నాకు మాత్రం ఒక వ్యక్తి తాను పుట్టిన ఊరిపై కాదు నెలపై ఇంత అనుభందం ఉంటుందా అని అప్పుడే అనిపించింది.ఏదైనా ఒక బంధం నిజంగా ఇంత బలంగా ఉంటే ఎంత బాగుంటుంది అనిపించింది. నాకూ అలాంటి వాటిలో దేనిపై బంధం ఉందో వెతుకులాడే ప్రయత్నం మొదలు పెట్టాను.

**లోకా సమస్తా సుఖినోభవంతు**

**సింగంపల్లి శేష సాయి కుమార్, 8639635907**

# ఈ కూరగాయలు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి..

కొలెస్ట్రాల్ మన శరీరానికి చాలా అవసరం. కానీ అధికంగా ఉంటే చాలా హాని కరం. కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగితే ధమనులు మూసుకుపోతాయి. ఈ క్రమంలో గుండెపోటు, స్ట్రోక్ వంటి తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అయితే ఈ సమస్యల నుంచి దూరంగా ఉండేందుకు ఆహారం ద్వారా కంట్రోల్ చేయవచ్చు. ఆహారంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా కొలెస్ట్రాల్‌ను నియంత్రించవచ్చు. మంచి ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అంతే కాకుండా.. మీ వంటగదిలో ఉండే కొన్ని కూరగాయలు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండి కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇంతకీ కొలెస్ట్రాల్‌ను తగ్గించే ఆ కూరగాయలేంటో తెలుసుకుందాం.

**క్యారెట్:** క్యారెట్‌లో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు, కరిగే ఫైబర్ శరీరంలోని కొలెస్ట్రాల్ శోషణను తగ్గించడం ద్వారా అధిక కొలెస్ట్రాల్ సమస్య నుండి ఉపశమనాన్ని అందిస్తాయి. అంతే కాకుండా.. విటమిన్ ఎ సమృద్ధిగా ఉన్న క్యారెట్ కంటి చూపు, చర్మానికి కూడా మేలు చేస్తుంది. దీన్ని సలాడ్ లేదా ఇతర వంటలలో వండుకుని మీ ఆహారంగా తినవచ్చు.

**పొట్లకాయ:** పొట్లకాయలో నీరు, పీచు పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా.. కడుపుని శుభ్రపరుస్తుంది. మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా నియంత్రణలో ఉంచుతుంది. పొట్లకాయను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బరువు తగ్గడమే కాకుండా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గించుకోవచ్చు. ఇది శరీరం నుండి విషాన్ని తొలగించడంలో కూడా సహాయపడుతుంది.

**టొమాటో:** టొమాటోల్లో లైకోపీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డిఎల్), ట్రైగ్లిజరైడ్‌లను తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషించే యాంటీఆక్సిడెంట్. అంతే కాకుండా.. టొమాటోలో ఉండే ఫైబర్ శరీరంలో కొలెస్ట్రాల్ శోషణను తగ్గిస్తుంది. టొమాటో లేదా దాని రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

**బచ్చలికూర:** బచ్చలికూర పచ్చి ఆకు కూరలలో పోషకాల నిధి. ఇందులో ఫైబర్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బచ్చలికూరలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదం నుండి కూడా రక్షిస్తుంది. ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాకుండా బచ్చలికూరలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా కాపాడుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది.. తద్వారా అనేక వ్యాధులను నివారిస్తుంది.

## సరికొత్త సీరియల్

# చాకిరేవు



(గతవారం తరువాయి).

కొండారెడ్డితో ఎవరూ పెట్టుకోరు, తనకున్న రాజకీయ, ఆర్థిక బలం ముందు ఎవరూ నిలబడటానికి కూడా సాహసించరు. కోరిన స్త్రీని అనుభవించడంలో వెనకడుగు వేయడు. పాపులమ్మ విషయంలో అలా జరగలేదని నిరాశ చెందాడు. పాపులమ్మను దక్కించుకోలేకపోవడం మాత్రమే కాకుండా దొమ్మల మీద తన్నందుకు ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు.

కొండారెడ్డి తండ్రికి ఇద్దరు కొడుకులు, ఒక బిడ్డ. కొండారెడ్డి పెద్దవాడు, వెంకట్ రెడ్డి రెండవవాడు. తమ్ముడు, చెల్లి పులివెందులలో ఉంటారు. పులివెందులకు చెందిన వైన్స్ వ్యాపారం చేసే వైన్స్ నారాయణ రెడ్డి కొడుకుకు కొండారెడ్డి చెల్లినిచ్చి పెళ్లి చేశారు.

కొండారెడ్డి చెల్లి పేరు సురేఖ రెడ్డి, భర్త పేరు విష్ణువర్ధన్ రెడ్డి. వెంకట్ రెడ్డి ముస్లిం అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పెళ్ళికాక ముందు తన పేరు నూర్జహాన్ అయితే పెళ్లి తర్వాత నిహారిక రెడ్డి అని మార్చుకుంది.

వెంకట్ రెడ్డి వైన్స్, మైన్స్ వ్యాపారాలు ఉన్నాయి. అది మాత్రమే కాకుండా పులివెందులలో ఉన్న అతికొద్ది మంది ధనవంతుల్లో వెంకట్ రెడ్డి కూడా ఒకడు. కొండారెడ్డి తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత తమ్ముడికి, చెల్లికి పెళ్లి చేశాడు.

పల్లెలో ఉండటం ఇష్టంలేక వెంకట్ రెడ్డి పులివెందులలో వైన్స్ అంగడి పెట్టుకున్నాడు. మొదట్లో ఒక అంగడి మాత్రమే ఉండేది, ప్రస్తుతం మూడు ఉన్నాయి. పులివెందుల గుట్ట మీద నాలుగు అద్దె ఇల్లులు తీసుకొని వ్యభిచార గృహాన్ని నడిపిస్తున్నాడు.

వైన్స్, మైన్స్ కంటే వ్యభిచారం నుండే చాలా సంపాదిస్తాడు. పులివెందుల చుట్టుపక్కల ఉన్న పల్లెల నుండి పెళ్ళైన వాళ్లను, పెళ్లికాని దళితుల, బీదల అమ్మాయిలను కూడా వ్యభిచార కూపంలోకి దింపుతాడు. దానికి కొండారెడ్డి సహాయ సహకారాలు అందిస్తుంటాడు. పాపులమ్మను కూడా అనుభవించి, పులివెందులకు పంపాలని నిర్ణయించుకున్నాడు.

కొండారెడ్డి నిర్ణయం వెనుక బలమైన కారణం ఏమిటంటే? పాపులమ్మ అందంగా ఉంటుంది. పెళ్లై బిడ్డ ఉన్నా నాజుగ్గా, తెల్లగా, నవ్వు ముఖంతో చక్కగా ఉంటుంది. పాపులమ్మ జుట్టు నల్లగా, పిరుదుల కింద వరకు ఒత్తుగా, మందంగా ఉంటుంది. సన్నని పై పెదవి, దొండపండు లాంటి కింద పెదవి, కత్తిలా చురుగ్గా ఉండే ముక్కు, బలమైన, బరువైన యద సంపద కొండారెడ్డికి మత్తు ఎక్కించాయి.

వేముల జాతరకు వెంకట్ రెడ్డితో పాటు, వెంకట్ రెడ్డి వ్యాపార భాగస్వామ్యులు పల్లెకు వెళ్లారు. పాపులమ్మను చూసి మనసుపడ్డారు, తనతో వ్యభిచారం చేయిస్తే బాగా సంపాదించవచ్చని కొండారెడ్డికి చెప్పారు.

పాపులమ్మకు ఉన్న ఆర్థిక కష్టాలు కారణంగా లొంగిపోతుందనుకున్నాడు కానీ అనుకున్నది జరగలేదు. అందుకే బిచ్చం ఎత్తుకునేలా చేశాడు. ఎన్ని కష్టాలైనా పెట్టి తనను లోబరచుకోవాలని పన్నాగం పన్నాడు. పాపులమ్మ దేనికీ భయపడలేదు, తన మానం కోసం బిచ్చం ఎత్తుకోడానికైనా సిద్ధపడింది.

గంగులు కనపడకపోవడానికి కొండారెడ్డి హస్తం ఉందేమోనని అనుమాన పడింది. నిజంగా కొండారెడ్డి గంగులును చంపి ఉంటాడా? గంగులును చంపితే ఏం వస్తుంది? గంగులును మొదట అడ్డు తొలగించుకుంటే, ఆ తర్వాత ఆదెన్నను అడ్డు తొలగించాలని చూస్తున్నాడా? అని హడలిపోయింది. జరిగిన విషయాన్ని భర్తకు చెప్తే మంచిదా, చెప్పకపోతే మంచిదా? దిక్కు తోచలేదు, మనసు కకావికలమయ్యింది, గుండెలో పొయ్యి పెట్టి ఉడికించినట్లు అనిపించింది. పాపులమ్మ ఆలోచనలు కాంతితో పోటీపడ్డాయి.

పాపులమ్మ ఆలోచనల్లో ఉండగా కడుపులో నొప్పిగా, బిడ్డ కొట్టినట్టు, తన్నినట్టు అనిపించింది. కొండారెడ్డిని తన్నిన సన్నివేశం గుర్తు వచ్చి గట్టిగా కేకలు వేసింది. సుబ్బక్క, అచ్చక్క, ఆదెన్న, గంగ గుమ్మిగూడారు.

'ఏమైందే నా తల్లి? ఎందుకు అరిచావు?' సుబ్బక్క భయంగా, ఆందోళనగా పాపులమ్మను మంచం మీద నుండి లేపింది.

'కడుపులో పిల్లాడు కదులుతున్నాడు, తంతున్నాడు. నొప్పిగా, బాధగా, భయంగా ఉంది.'

పాపులమ్మ కడుపు మీద సుబ్బక్క చేతులు పెట్టి చూసింది. పిల్లాడి తల పూర్తిగా కిందకు దిగి ఉంది. బహుశా! పురిటి నొప్పులు అయ్యుండచ్చని, ఫకీరప్పను పిలుచుకురమ్మని ఆదెన్నకు చెప్పింది.

భార్య నుదుటి మీద నుండి తల వరకు నిమిరి కంగారుపడకని చెప్పి పరుగు లాంటి నడకతో ఆదెన్న వెళ్లాడు. వేడి నీళ్లు సిద్ధం చేయమని అచ్చక్కకు చెప్పింది. అచ్చక్క వేడి నీళ్ల కోసం పొయ్యి వెలిగించడానికి వెళ్లింది.

పాపులమ్మకు నొప్పులు పెరిగాయి. అమ్మా, అమ్మా అంటూ తల్లిని పట్టుకొని గట్టి గట్టిగా అరిచింది. పాపులమ్మ అరుపులకు ఏమైందోనని పక్క గుడిసెల వాళ్లు వెళ్లారు.

కాసేపు ఓర్చుకో తల్లీ, అయిపోతుందని సుబ్బక్క పాపులమ్మకు ధైర్యం చెప్పింది. సుబ్బక్క మాటలు పాపులమ్మ చెవిలో పడలేదు, పడే అవకాశం లేదు. తన నొప్పిని, బాధను ఎవరూ తగ్గించలేరు. పుట్టబోయే బిడ్డను చూసేవరకు తల్లి పురిటి బాధను అనుభవిస్తుంది. బిడ్డను చూసిన తర్వాత బాధ మొత్తం మరచిపోతుంది.

అంతలోనే ఫకీరప్ప గసపోసుకుంటూ వెళ్లాడు. ఎంతసేపటి నుండి నొప్పులు పడుతోందని సుబ్బక్కను అడిగాడు. పొట్ట మీద, తొడల మధ్యలో నూనె పూయమని సుబ్బక్కకు చెప్పాడు. పాపులమ్మ వెనుక సద్దిబట్టల మూట వేసి ఆను కోమన్నాడు. పూర్తిగా పడుకోకుండా కాస్త పైకి లేచే మంచం మీద పడుకుంది.

పాపులమ్మ చీరను కిందకు లాగారు, లంగాను వదులు చేసి కడుపులో బిడ్డ తల సరైన స్థానంలో ఉందో లేదో చూశాడు. అంతా సరిగానే ఉందని భావించిన తర్వాత 'మగబిడ్డ కావాలా? ఆడబిడ్డ కావాలా?' అని అడిగాడు.

అంతటి నొప్పిలో కూడా 'ఎవరైనా సమ్మతమే కానీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, తన బిడ్డకు ఎలాంటి సమస్య ఉండకూడదనింది.'

'మరి బిడ్డను ఎక్కువగా ఇబ్బంది పెట్టకుండా గట్టిగా కిందకు తొయ్యి, బిడ్డ త్వరగా, క్షేమంగా బయటకు వస్తాడు. నువ్వు గట్టిగా ముక్కకపోతే పిల్లాడు బయటకు రాలేడు, నీ పిల్లాడికి ఏమీ కాదు.'

పాపులమ్మ గట్టిగా ముక్కింది కానీ ప్రసవం అవ్వలేదు. ఫకీరప్ప రెండు చేతులకు నూనె పూసుకొని పాపులమ్మ కడుపు మీద నుండి బిడ్డను కిందకు తోశాడు. పాపులమ్మ అరుపులు పల్లెలో మారుమ్రోగాయి.

'బిడ్డ తల కనపడుతోందా?' ఫక్కీరప్ప సుబ్బక్కను అడిగాడు.

'అవును, చేతులకు తగులుతోంది కానీ బయటకు రావట్లేదు.'

మరింత బలంగా బిడ్డను తోశాడు. రెండు చేతులతో సద్దిబట్టలను గట్టిగా పట్టుకుంది. కాళ్లు కదలకుండా వెడల్పు చేసి పట్టుకోమని సుబ్బక్క అచ్చక్కకు చెప్పింది. రెండు కాళ్లను చాలా వెడల్పు చేశారు. బిడ్డ తల చేతులకు తగులుతోంది కానీ బయటకు రావడం కష్టంగా ఉంది. ఆదెన్న కంగారుగా బయట కూర్చొని ఉన్నాడు. ఫకీరప్పకు తోయడం కుదరడం లేదు, దాంతో ఆదెన్న అని గట్టిగా కేక వేశాడు.

ఆదెన్న గుడిసెలోకి వెళ్లాడు. కడుపు మీద చేతులేసి బలంగా కిందకు తోయమని చెప్పాడు. ఆదెన్న వెంటనే చేతులకు నూనె పూసుకొని బిడ్డను బలంగా తోశాడు. బిడ్డ తల సగం బయటకు వచ్చింది.

లాగు లాగు అంటూ ఫక్కీరప్ప గట్టి గట్టిగా కేకలు వేశాడు. సుబ్బక్క బిడ్డను సుతారంగా, నెమ్మదిగా, చాకచక్యంగా బయటకు లాగింది.

బిడ్డను పాపులమ్మ యద మీద వేశారు. బిడ్డను చూడగానే అప్పటివరకు కేకలు పెట్టిన పాపులమ్మ మౌన లోకంలో విహరించింది. కొడుకు పుట్టాడని పాపులమ్మకు ఫకీరప్ప గర్వంగా చెప్పాడు.

కూతురు కంటే కొడుకు పుట్టడం శుభపరిణామంగా, అదృష్టంగా సమాజం భావించేది, భావిస్తోంది కూడా. ఆదెన్న కన్నుల నుండి ఉమ్మనీటితో పోటీగా కన్నీరు పారింది. పక్కనే ఉన్న అచ్చక్క వెక్కి వెక్కి ఏడ్చింది.

రక్తం, ఉమ్మనీరు గుడిసెలో పారింది. సద్దిబట్టలతో ఉమ్మనీటిని శుభ్రం చేశారు. బిడ్డను చేతిలోకి తీసుకొని ఫకీరప్ప కత్తితో బొడ్డుపేగును కోశాడు. సుబ్బక్క పిల్లాడిని శుభ్రం చేసి, నూనె పూసింది.

ఒక చిన్న బట్టలో పిల్లాడిని చుట్టి పాపులమ్మ పక్కన పడుకోబెట్టారు. పాపులమ్మ అచ్చక్కను పిలిచి పిల్లాడిని ఇచ్చి.. నా బిడ్డ, నీ బిడ్డ కూడా అనింది. అచ్చక్క సంతో షానికి అవధులు లేకుండా పోయింది. పాపులమ్మను గట్టిగా హత్తుకుంది.

ఒకవైపు భర్త బతికి ఉన్నాడో, చనిపోయాడో తెలియని పరిస్థితి. మరోవైపు పిల్లలు లేకపోవడం అచ్చక్కకు తీరని లోటు, బాధ, కష్టం. పిల్లాడిని చేతిలోకి తీసుకోగానే మనసు చల్లబడింది. బిడ్డను గట్టిగా గుండెలకు హత్తుకుంది. తమ్ముడు పుట్టాడని గంగ సంబరం చేసుకుంది. పాపులమ్మ పక్కలో బిడ్డను పడుకో బెట్టిన తర్వాత బిడ్డ బుగ్గల మీద నిమురుతూ ఆడుకుంది.

గంగ పుట్టిన చాలా సంవత్సరాలకు పాపులమ్మకు బిడ్డ పుట్టాడు. పాపులమ్మ గర్భం దాల్చడానికి స్వామి చెప్పినట్టు అన్నదానం చేయాల్సి రాలేదు. పిల్లల కోసం యజ్ఞాలు, యాగాలు, హోమాలు లాంటివి చేయాల్సిన అవసరం లేదు. లేనివారికి అన్నదానం చేయడంలో తప్పు లేదు కానీ పిల్లలు పుట్టలేదని, జాతకం బాగాలేదని, పెళ్లి అవ్వడం లేదనే కారణాలతో బీదవారిని హింసించడం, ఏదో పాపం చేశారు కాబట్టే పిల్లలు పుట్టలేదనే నిందలు, ఆరోపణలు, మూఢనమ్మకాలు సమాజానికి ఏమాత్రం మంచి చేయవు.

పిల్లలు పుట్టలేదంటే ఏదో ఒక సమస్య ఉంటుంది, ఆ సమస్యను తెలుసుకొని మంచి వైద్యం చేయించుకుంటే పిల్లలు పుట్టే అవకాశముంది. ఒకవేళ పిల్లలు పుట్టలేదంటే యజ్ఞాలు, యాగాలు కాకుండా అనాథలను చేరదీయడం లాంటి చేసి మానవత్వంతో మనుషులు మెలగాలి.

పాపులమ్మకు సుఖప్రసవం అవ్వడంతో కుటుంబం సంతోషించింది.

***

పిల్లాడికి స్నానం చేయించడం, చక్కగా ముస్తాబు చేయడం లాంటివి సుబ్బక్కే చేసింది. సుబ్బక్క పిల్లాడిని ముస్తాబు చేయగానే అచ్చక్క తీసుకొని ఆడించేది, ఎత్తుకొని తిరిగేది. పిల్లాడు ఏడిస్తే తను కూడా ఏడ్చేది, నవ్వితే నవ్వేది. పిల్లాడితో అనుబంధాన్ని పెంచుకుంది. పాలు ఇవ్వడానికి తప్ప మరే సమయం లోనూ ఎవరికీ ఇచ్చేది కాదు. పిల్లాడికి ఎలా స్నానం చేయించాలి, బట్టలు ఎలా తొడగాలి? లాంటివి సుబ్బక్క నుండి నేర్చుకొని తనే స్నానం చేయించింది.

కాసేపు పిల్లాడిని ఎత్తుకోడానికి అడిగితే ఇచ్చేది కాదు. మీరు పిల్లాడిని సరిగా చూసుకోరు, నేనైతే బాగా చూసుకుంటానని ప్రాణం పిల్లాడిపైనే పెట్టుకుంది. పిల్లాడిని చూసుకుంటూ బాధలను మర్చిపోడానికి ప్రయత్నించింది.

పిల్లాడు ఏడ్చినప్పుడు పాపులమ్మకు ఇచ్చి పాలు తాపమని చెప్పేది. తనకే పాలు వచ్చి ఉంటే బాగుండేదని బాధపడింది. పాలు తాగిన వెంటనే పిల్లాడిని ఎత్తుకునేది, ఏవేవో కథలు చెప్తూ పిల్లాడి ప్రపంచంలో మునిగిపోయింది.

పాపులమ్మ దాని గురించి పెద్దగా పట్టించుకోలేదు. పిల్లాడిని పాపులమ్మకు కూడా దూరం చేస్తుందేమోనని సుబ్బక్క భయపడింది. అచ్చక్క పిల్లాడిని ఎత్తుకోగానే తన దగ్గర నుండి గుంజుకొని, మేము కూడా కాసేపు పిల్లాడితో ఆడుకోవాలి కదా అనింది.

అలా ఏదో ఒక సాకుతో అచ్చక్కకు పిల్లాడిని దూరం చేయాలనుకుంది, చేసింది. సుబ్బక్క ప్రవర్తనను పాపులమ్మ అర్థం చేసుకుంది. అచ్చక్కతో తన తల్లి అలా ఉండటం, పిల్లాడిని దూరం చేయడం నచ్చలేదు. ఇప్పటికే భర్త దూరమైన బాధలో ఉన్న అచ్చక్కను మరింత బాధపెట్టకుండా ఉంటేనే బాగుంటుందనుకుంది.

రాత్రి పడుకునే సమయంలో 'నువ్వు అలా చేయకమ్మా' అనింది.

పాపులమ్మ ఏం చెప్తోందో అర్థంకాక 'దేని గురించి మాట్లాడుతున్నావు?' అయోమయంగా ముఖం పెట్టింది.

'పిల్లాడిని అచ్చక్క నుండి దూరం చేయాలనే ఆలోచనను మానుకో, తను బాధలో ఉండి అలా ప్రవరిస్తోంది కానీ పిల్లాడిని మనకు దూరం చేయాలని కాదు, ఒక్కసారి తన స్థానంలో ఉండి ఆలోచించు.'

'ఏం చేయాలో? ఎలా చేయాలో? నాకన్నీ తెలుసు కానీ, నువ్వు నోరు మూసుకొని పడుకో' కోపంగా, ఆవేశంగా అటువైపు తిరిగింది.

'నీకు తెలియదని అనడం లేదు. భర్త లేడనే బాధ ఒకవైపు, పిల్లలు పుట్టకపోవడంతో తను అలా చేస్తోంది, పైగా తనకు మతి సరిగా లేదని నీకు తెలియంది కాదు.'

'మతి సరిగా లేదనే అలా చేస్తున్నాను. అలానే వదిలేస్తే పిలాడిని నీకు కాకుండా చేస్తుంది. ఇలాంటి వాళ్లను నా జీవితంలో చాలామందిని చూశాను. తనకు పిల్లలు లేరనే బాధలో న్యాయం ఉంది కానీ వేరే వాళ్ల పిల్లలను వాళ్లకే కాకుండా చేయడం అన్యాయమే అవుతుంది.'

'తనను అలానే వదిలేస్తే కొన్ని రోజులకు పిల్లాడిని తీసుకొని పుట్టింటికి వెళ్లిపోతుంది. గంగ పుట్టినప్పటి నుండి నువ్వు, అల్లుడు పిల్లల కోసం ఎన్ని దేవుళ్లకు మొక్కారో నాకు తెలియదా? అల్లుడికి పిల్లలంటే ప్రాణం, గొడ్డుచాకిరి చేసి వచ్చిన తర్వాత పిల్లలతో ఆడుకోవాలని ఏ తండ్రైనా కోరుకుంటాడు. పిల్లాడిని కన్నతండ్రికి కూడా ఇవ్వకపోతే ఎలా?'

సుబ్బక్క మాటల్లో నిజం ఉంది కానీ అచ్చక్క బాధను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. పైగా అచ్చక్కకు మతి సరిగా లేదు, అర్థమయ్యేలా చెప్పాలనుకుంది. సుబ్బక్కకు ఎదురు చెప్పకుండా ఆలోచించుకుంటూ నిద్రలోకి జారుకుంది.

పాపులమ్మ నెమ్మదిగా పనులు చేయడం మొదలు పెట్టింది. పిల్లాడు పుట్టి 21 రోజులు గడిచిపోయింది కాబట్టి పేరు పెట్టాలనుకున్నారు. ఒక్కక్కరు ఒక్కో పేరు చెప్పారు. సుబ్బక్క నారాయణ పేరును సూచించింది.

పాపులమ్మకు నారాయణ అని పెట్టడం ఇష్టం లేదు. అసలు గంగకు కూడా పేరు మార్చాలని అనుకుంది.

(మిగతా వచ్చేవారం)



జాని తక్కెడశిల
7259511956



# కళల కాణాచి మన తెలంగాణ

**తెలంగాణ సంస్కృతికి సుమారు 5,000 సంవత్సరాల సాంస్కృతిక చరిత్ర ఉంది. కాకతీయులు , కుతుబ్ షాహీలు మరియు అసఫ్ జాహీ రాజవంశాల పాలనలో ఈ ప్రాంతం భారత ఉపఖండంలో అగ్రశ్రేణి సంస్కృతికి కేంద్రంగా ఉద్భవించింది. పాక, కళలు మరియు సంస్కృతి పట్ల పాలకుల ప్రోత్సాహం మరియు ఆసక్తి తెలంగాణను బహుళ-సాంస్కృతిక ప్రాంతంగా మార్చింది, ఇక్కడ రెండు విభిన్న సంస్కృతులు కలిసి ఉన్నాయి, తద్వారా తెలంగాణను దక్కన్ పీఠభూమికి ప్రతినిధిగా మరియు వరంగల్ మరియు హైదరాబాద్‌తో దాని కేంద్రంగా దాని వారసత్వాన్ని తయారు చేసింది.**



-డా . జి. వెన్నెల గద్దర్
చైర్మన్
తెలంగాణ సాంస్కృతిక సారథి

తెలంగాణకు చెందిన హైదరాబాదీ వంటకాలు, కాకతీయ ఆర్కిటె క్చర్ రెండూ యునెస్కో క్రియేటివ్ సిటీ ఆఫ్ గ్యాస్ట్రో నమీ, యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ జాబితాలో ఉ న్నాయి . బోనాలు , బతుకమ్మ, దసరా, ఉగాది, సంక్రాంతి, మిలాద్ ఉన్ నబీ రంజాన్ వంటి మతపరమైన పండుగలతో పాటుగా "కాకతీయ ఫెస్టివల్" మరియు దక్కన్ ఫెస్టివల్ జరుపుకునే ప్రధాన సాంస్కృతిక కార్యక్రమాలు . తెలంగాణ రాష్ట్రం చాలా కాలంగా విభిన్న భాషలు మరియు సంస్కృతుల కలయిక ప్రదేశం. దీనిని "సౌత్ ఆఫ్ నార్త్ మరియు నార్త్ ఆఫ్ సౌత్" అని పిలుస్తారు. ఇది గంగా-జమున తెహజీబ్‌కు కూడా ప్రసిద్ధి చెందింది మరియు రాజధాని హైదరాబాద్ ఓరియంటల్ సంస్కృతికి కేంద్రంగా ఉంది, ఇది భారతదేశంలో మొదటి వారసత్వ నగరంగా మారింది. దక్షిణ భారత రాష్ట్రమైన తెలంగాణ, చరిత్ర మరియు సంప్రదాయాలు లోతుగా పాతుకుపోయిన కళ, సంస్కృతి మరియు వారసత్వ సంప ద యొక్క నిధి. దాని శక్తివంతమైన సాంస్కృతిక ప్రకృతి దృశ్యం శతాబ్దాల రాజవంశ పాలన, పర్యావరణ కారకాలు మరియు దాని ప్రజల స్థితిస్థాపక స్ఫూర్తితో రూపొందించబడింది. సున్నితమైన హస్తకళల నుంచి శాశ్వతమైన సంప్రదాయాల వరకు, తెలంగాణ సాంస్కృతిక వారసత్వం ప్రాచీన మరియు సమకాలీన చైతన్యవం తమైన సమ్మేళనం. చెరియాల్ స్క్రోల్ పెయింటింగ్‌లు మహాభారతం మరియు రామాయణం వంటి ఇతిహాసాల నుండి కథలను స్పష్టంగా వర్ణించే ఒక ప్రత్యేకమైన కథన కళారూపం. సహజ రంగులు మరియు సాంప్రదాయ మూలాంశాలతో రూపొందిం చబడిన ఈ స్క్రోల్‌లు గ్రామీణ తెలంగాణలోని కథా సంప్రదా యాలలో అంతర్భాగంగా పనిచేస్తాయి. డోక్రా కళ సాంప్రదాయ మెటల్-కాస్టింగ్ క్రాఫ్ట్ పురాతన లాస్ట్-మైనపు సాంకేతికతను ఉపయోగిస్తుంది, క్లిష్టమైన బొమ్మలు, నగలు మరియు అలంకరణ వస్తువులను ఉత్పత్తి చేస్తుంది. గిరిజన కళాకారులచే రూపొందించ బడిన డోక్రా కళ ఈ ప్రాంతం యొక్క గొప్ప గిరిజన వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. బిద్రీవేర్ బీదర్‌లో పుట్టినప్పటికీ, తెలంగాణ సమీపంలో అభివృద్ధి చెందింది. బిడ్రివేర్‌లో కుండీలు ఆభరణాలు వంటి బ్లాక్ మెటల్ వస్తువులపై వెండి డిజైన్‌లను పొదిగించడం, ఈ ప్రాంతం యొక్క అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. తెలంగాణ సాంస్కృతిక పరిణామం వివిధ రాజవంశాల పాలనతో ముడిపడి ఉంది:

**వరంగల్‌ను రాజధానిగా**

కాకతీయులు 11-14 వ శతాబ్దం, వరంగల్‌ను రాజధానిగా చేసుకుని తెలంగాణ సాంస్కృతిక గుర్తింపును సుసంపన్నం చేశారు. వారు ఆలయ కళను పెంపొందించారు, శివునికి అంకితమైన "యోధుల నృత్యం" అయిన పేరిణి శివతాండవం వంటి నృత్య రూపాల సృష్టికి దారితీసింది.

(మిగతా 8వ పేజీలో)



( 7వ పేజీ తరువాయి)

## తెలంగాణ సాంస్కృతిక కేంద్రం



సామాన్యులు ఒగ్గు కథలు మరియు గోత్రాలు వంటి సంప్రదాయాలను అభివృద్ధి చేశారు, సమస్య పరిష్కార చర్చలతో కథలను కలపడం. అలాగే కుతుబ్ షాహీలు మరియు నిజాం పాలకులు పర్షియన్ ప్రభావాలను ఈ ప్రాంతానికి తీసుకువచ్చారు, హైదరాబాద్‌ను సాంస్కృతిక కార్యక్రమాల కేంద్రంగా మార్చారు. కవ్వాలీలు, గజల్‌లు, ముషాయిరాలు వంటి కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక సారాంశానికి కేంద్రంగా మారాయి. కల్చరల్ రెసిస్టెన్స్, స్టోరీస్ ఆఫ్ స్ట్రగుల్ అండ్ రెసిలెన్స్ తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ప్రతిఘటన స్ఫూర్తి చిరస్థాయిగా నిలిచిపోయింది. మేడారం జాతర గిరిజన పండుగ 13వ శతాబ్దపు కరువు సమయంలో కాకతీయ పాలకులను ఎదిరించిన తల్లీ కూతుళ్లైన సమ్మక్క మరియు సారక్కల ధైర్యసాహసాలకు ప్రతిరూపం. ఆదివాసీల పురాణాలలో లోతుగా పాతుకుపోయిన ఈ పండుగ ఆసియాలోనే అతి పెద్దది. జానపద గాన శైలులు ముఖ్యంగా భూస్వా ములు, అణచివేత పాలకులకు వ్యతిరేకం గా జరిగిన పోరాటాల సమయంలో, అణచివేతకు గురైన వారి మనోభావాలను ఉద్ధరించే మార్గంగా త్వరితగతిన జానపద పాటలు ఉద్భవించాయి. పేరిణి శివతాండవం యోధులు యుద్ధానికి వెళ్లే ముందు ప్రదర్శించారు, ఈ పురాతన నృత్య రూపం శివుని భక్తికి శక్తివంతమైన వ్యక్తీకరణ. అలాగే ఒగ్గు కథ సంప్రదాయ కథా కళ, బల్లడీర్లు ప్రదర్శించారు, శివుడు వంటి దేవతల కథలు మరియు కొమురం భీం వంటి జానపద నాయకుల కథలను వివరిస్తుంది. సంచార బంజారా తెగ వారు ప్రదర్శించే లంబాడీ నృత్యం రంగురంగుల వేషధారణలు మరియు లయబద్ధమైన కదలికల సజీవ ప్రదర్శన.



బతుకమ్మ పాటలు మరియు జానపద గీతాలతో సహా తెలంగాణ జానపద సంగీతం , జీవితం మరియు సమాజ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. శారద వీణ వంటి వాయిద్యాలు విలక్షణమైన స్థానిక రుచిని అందిస్తాయి. భద్రాచల రామదాసు వంటి ప్రముఖుల భక్తిరస స్వరకల్పనలతో రాష్ట్రం కర్ణాటక సంగీతానికి గణనీయంగా తోడ్పడింది.

## సాహిత్య దిగ్గజాలు

బొమ్మెర పోతన, కాళోజీ నారాయణరావు, దాశరథి కృష్ణమాచార్యులు, సి. నారాయణ రెడ్డి, గద్దర్ వంటి సాహిత్య దిగ్గజాలను తెలంగాణ సృష్టించింది. పద్యం మరియు రాగం వంటి మౌఖిక సంప్రదాయాల ద్వారా వర్గీకరించబడిన జానపద సాహిత్యం అభివృద్ధి చెందుతూనే ఉంది, ఈ ప్రాంతం యొక్క గొప్ప సాంస్కృతిక నైతికతను కాపాడుతుంది. రామప్ప దేవాలయం, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం, కాకతీయ రాజవంశం యొక్క శిల్పకళా వైభవానికి ఉదాహరణ. గోల్కొండ కోట, చార్మినార్ వంటి నిర్మాణాలు భారతీయ మరియు పర్షియన్ శైలిని మిళితం చేస్తాయి, తెలంగాణ యొక్క విభిన్న ప్రభావాలను ప్రదర్శిస్తాయి.

భూధాన్ పోచంపల్లి మెట్ల బావి వంటి పురాతన మెట్ల బావులు తెలివిగల నీటి నిర్వహణ పద్ధతులు మరియు నిర్మాణ సొబగులను హైలైట్ చేస్తాయి.

సంక్లిష్టమైన రేఖాగణిత నమూనాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇకత్ సంప్రదాయాన్ని చక్కదనంతో మిళితం చేసే ఒక నేత పద్ధతి.

గద్వాల్ చీరలు చేతితో నేసిన చీరలు రిచ్ సిల్క్ బార్డర్‌లతో తేలికపాటి కాటన్ బాడీలను కలిగి ఉంటాయి, అందం మరియు సౌకర్యాన్ని సజావుగా మిళితం చేస్తాయి.తెలంగాణ కళ మరియు సంస్కృతి చరిత్ర, సంప్రదాయం మరియు ఆధునిక ప్రభావాల యొక్క శక్తివంతమైన సమ్మేళనం. దాని కథా గ్రంథపు చుట్టల నుండి దాని గంభీరమైన దేవాలయాల వరకు, మనోహరమైన సంగీతం నుంచి రంగురంగుల పండుగల వరకు, తెలంగాణ ఒక డైనమిక్ సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చెందుతూనే ఉంది, భవిష్యత్తును ఆలింగనం చేసుకుని దాని గతాన్ని జరుపుకుంటుంది.



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన తాజా సినిమా 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధాశ్రీనాథ్ హీరోయిన్లు. కొత్త దర్శకుడు రవితేజ ముళ్ళ పూడి తీసిన ఈ సినిమాలో కథ ఏమిటి? కథనం ఎలా ఉంది? హీరో హీరోయిన్లు ఎలా నటించారు? వినోదం ఎలా ఉంది? వంటివి చూస్తే...

**కథ :** రాకీ... రాకేష్ (విశ్వక్ సేన్) హైదరాబాద్ కుర్రాడు. లైఫ్ ఎంజాయ్ చేయడం తెలిసినోడు. ఫ్రెండ్ సిస్టర్, తన జూనియర్ ప్రియా (మీనాక్షి చౌదరి)తో ప్రేమ వ్యవహారం ఒకటి ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో కాలేజీ మానేసి వారసత్వంగా తండ్రి రామకృష్ణ (నరేష్) నుంచి వచ్చిన ఆర్కే గ్యారేజ్ బాధ్యతలు చూసుకోవాలసి వస్తుంది. గ్యారేజ్ సైట్ మీద రంకిరెడ్డి (సునీల్) కన్ను పడుతుంది. గ్యారేజ్ కాపాడుకోవడం కోసం బ్యాంకుల చుట్టూ లోన్ కోసం తిరుగుతాడు రాకీ. ఆ సమయంలో డ్రైవింగ్ నేర్చుకోవడానికి వచ్చిన మాయ (శ్రద్ధా శ్రీనాథ్)కు రాకీ సమస్య తెలిసి ఎటువంటి సాయం చేసింది? రాకీ జీవితంలోకి మళ్ళీ ప్రియా రావడం వల్ల ఎటువంటి మార్పు చోటు చేసుకుంది? గ్యారేజ్ కాపాడుకున్నాడా? లేదా? అందుకు రాకీ ఇంకేం చేశాడు? అతని జీవితంలో గ్యారేజ్ మించిన సమస్యలు ఏమున్నాయి? చివరకు ఎలా సాల్వ్ చేశాడు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ :** స్క్రీన్ ప్లే, అందులో భాగంగా వచ్చే ట్విస్ట్ ఏదైనా సరే... ప్రేక్షకుల ఊహకు అందనంత వరకు షాక్ మూమెంట్ / వావ్ ఫ్యాక్టర్ ఇస్తాయి. ట్విస్ట్ రివీల్ కావడానికి ముందు ఊహిస్తే... స్క్రీన్ ముందు సినిమా చూసే ప్రేక్షకుడికి మజా ఉండదు. 'మెకానిక్ రాకీ'లో వావ్ ఫ్యాక్టర్ మిస్ అయ్యింది. ముందు ముందు జరిగేది తెలిసేలా ఉండటంతో మజా పోయింది.

'మెకానిక్ రాకీ' టీజర్, పాటలు, ట్రైలర్లు చూస్తే పక్కా కమర్షియల్ సినిమా ప్రేక్షకులు ఓ అంచనాకు వచ్చే అవకాశాలు ఎక్కువ. అయితే...



ఆ అంచనాలు తప్పు అని, అంతకు మించి అనేటటువంటి కథ సినిమాలో ఉంది. అది ప్లస్సే. కానీ, అసలు కథలోకి వెళ్లేటప్పుడు, ఒక్కో ట్విస్ట్ రివీల్ కావడానికి ముందు ఊహించేలా ఉండటం పెద్ద మైనస్. దానికి తోడు అవుట్ డేటెడ్ స్క్రీన్ ప్లే, కమర్షియల్ హంగులు కామన్ ఆడియన్ అటెన్షన్ డైవర్ట్ చేస్తాయి.

'మెకానిక్ రాకీ' ఫస్టాఫ్‌లో కథ కొంచెం కూడా ముందుకు వెళ్ళదు. పోనీ ఫుల్లుగా ఎంటర్‌టైన్ చేసిందా అంటే అదీ లేదు. తండ్రితో తిట్లు తినే కొడుకు, కాలేజీలో ప్రేమ కథ - కామెడీ, ఆ విలన్ ట్రాక్... ఇప్పటికే వందల సినిమాల్లో చూసిన కథను కొత్త డైలాగులతో మళ్లీ చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. ఇంటర్వెల్ తర్వాత గానీ అసలు కథలోకి వెళ్లలేదు. తండ్రి పాత్రను ముందుగా మనకు చూపించడంతో క్లైమ్యాక్సులో కిక్ మిస్ అవుతాం. కొంతలో కొంత శ్రద్ధా శ్రీనాథ్ క్యారెక్టర్ ట్విస్ట్ వర్కవుట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఛేజ్ సీక్వెన్సులు బాగా తీశారు. కామెడీ కొన్ని సన్నివేశాల్లో బావుందంతే! సినిమాటోగ్రఫీ, మ్యూజిక్, ఎడిటింగ్, ప్రొడక్షన్ వేల్యూస్... కమర్షియల్ సినిమాకు తగ్గట్టు ఉన్నాయి తప్ప నోటీస్ చేసేలా లేవు. పాటలు కథకు అడ్డు తగిలాయి. కొత్త దర్శకుడు రవితేజ ముళ్ళపూడి కథ తమిళ్ బ్లాక్ బస్టర్ సినిమాను గుర్తు చేసేలా ఉంది.

విశ్వక్ సేన్ ఎప్పటిలా హుషారుగా నటించారు. ఫైటుల్లో అగ్రెషన్ చూపించారు. పంచ్ డైలాగ్స్ తనదైన శైలిలో చెప్పారు. కథలో మంచి కోర్ పాయింట్ ఉండేలా చూసుకోవడంలో సక్సెస్ అయ్యారు. కానీ, అది కరెక్టుగా ఎగ్జిక్యూట్ అవుతుందా? స్క్రీన్ ప్లే బావుందా? లేదా? అనేది చూసుకోవడంలో సక్సెస్ కాలేదు. విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి పెయిర్ ఓకే. కానీ ఇద్దరి మధ్య లవ్ / ఎమోషనల్ ట్రాక్ అంతగా వంర్కవుట్ కాలేదు. మీనాక్షి నటన ఓకే. ఇంటర్వెల్ వరకు శ్రద్ధా శ్రీనాథ్ ఒకలా ఉంటే, ఆ తర్వాత రివీల్ అయ్యే ట్విస్టుల వల్ల మరోలా ఉంటుంది. యాక్టింగ్ ఓకే కానీ ఆ మేకోవర్ (ముఖ్యంగా బేబీ హెయిర్ కట్ విగ్, మేకప్) ఆమెకు సెట్ కాలేదు.

నరేష్, హర్ష చెముడు, హర్షవర్ధన్, 'హైపర్' ఆది కొన్ని సన్నివేశాల్లో నవ్వించారు. '35 చిన్న కథ కాదు' ఫేమ్ విశ్వదేవ్ రాచకొండ కీలకమైన క్యారెక్టర్ చేశారు. రోడీస్ రఘు రోల్ రెగ్యులర్‌గా ఉంది. సునీల్ స్క్రీన్ స్పేస్ తక్కువ. ఉన్నంతలో న్యాయం చేశారు. మిగతా నటీనటులు గుర్తుంచుకునే క్యారెక్టర్లు చేయలేదు.

'మెకానిక్ రాకీ'లో విషయం ఉంది. సామాన్యులు చాలా మంది ఘరానా కేటుగాళ్ల చేతిలో ఎలా మోసపోతున్నారు అనేది చెప్పారు. అయితే... అసలు కథ వచ్చేసరికి ఆలస్యం అయ్యింది. అప్పటి వరకు రొటీన్ కమర్షియల్ సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది. టూమచ్ రొటీన్ ఫస్టాఫ్‌తో కంపేర్ చేస్తే సెకండాఫ్ బెటర్. ఇంటర్వెల్ తర్వాత కూడా ట్విస్టులను మరింత బాగా ఎగ్జిక్యూట్ చేయాల్సింది. కామెడీ కొంత వర్కవుట్ కావడం థియేటర్లకు వెళ్లిన ప్రేక్షకులకు ఊరట. ఫైనల్‌గా డిజప్పాయింట్ చేసింది దాసు!

# చలికాలం వచ్చేసింది.. న్యుమోనియాతో జాగ్రత్త

న్యుమోనియా అనేది ప్రాణాంతకమైన ఊపిరితిత్తుల సంక్రమణ వ్యాధి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కలిగిన వ్యక్తులకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. కాలుష్యం కారణంగా ,అలాగే చలి కలం కారణంగా న్యుమోనియా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. అందువల్ల దాని గురించి జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఉంది. న్యుమోనియా అభివృద్ధి చెందే ప్రమాదాన్ని తగ్గించడానికి కొన్ని పద్ధతులు పాటిస్తే సురక్షితంగా ఉండవచ్చు. న్యుమోనియాను నివారించడానికి టీకాలు వేయడం అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి. న్యుమోకాకల్ టీకా బాక్టీరియల్ న్యుమోనియా అత్యంత సాధారణ కారణాలలో ఒకదాని నుండి రక్షిస్తుంది. అయితే వార్షిక ఫ్లూ టీకా న్యుమోనియాకు దారితీసే శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను నిరోధించడంలో సహాయపడుతుంది. మీ వయస్సు, ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా టీకాల కోసం మీ వైద్యుడిని సంప్రదించండి. సబ్బు, నీటితో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం వల్ల శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే జెర్మ్స్ వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చు. సంక్రమణ ప్రమాదాన్ని తగ్గించడానికి మీ ముఖాన్ని, ముఖ్యంగా మీ నోరు, ముక్కు, కళ్ళను తాకడం మానుకోండి. మీరు అనారోగ్యంతో ఉన్నట్లయితే, మీరు దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు క్రిములు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి మీ నోరు, ముక్కును మీ మోచేయితో కప్పుకోండి.ధూమపానం ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది. అలాగే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. న్యుమోనియాతో సహా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు వ్యక్తులను మరింత ఆకర్షిస్తుంది. ధూమపానం మానేయడం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. దింతో న్యుమోనియా ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యంగా విటమిన్ సి, జింక్ అధికంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. రెగ్యులర్ శారీరక శ్రమ కూడా ఆరోగ్యం, రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. ఇది సంక్రమణ అవకాశాలను తగ్గిస్తుంది. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు గాలిలోకి వెళ్లే నీటి చుక్కల ద్వారా కూడా న్యుమోనియా వ్యాపిస్తుంది.

# ఇంట్లో అక్వేరియం ఏ దిక్కున ఉంచాలి

హిందూ మతంలో వాస్తుకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఇంటి నిర్మాణం నుండి ఇంట్లో ఉంచే ప్రతి వస్తువు వరకు వాస్తు నియమాలను పాటించడం చాలా ముఖ్యం. ఇలా చేయకుంటే ఇంట్లో వాస్తు దోషం ఏర్పడుతుంది. దీని వల్ల ఇంటి సభ్యులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటి అనేక విషయాలు వాస్తు శాస్త్రంలో కూడా ప్రస్తావించబడ్డాయి. వాస్తు ప్రకారం మాత్రమే ఇంట్లోని వస్తువులను ఉంచిన ట్లయితే.. ప్రతికూల శక్తి పోయి, ఇంట్లో ఆనందం , శ్రేయస్సు పెరుగుతాయి. వాస్తు ప్రకారం, ఇంట్లో చేపల అక్వేరియం ఉంచడం మంచిది. మరి అక్వేరియం ఇంట్లో పెట్టేటప్పుడు ఎలాంటి వాస్తు చిట్కాలు పాటించాలి. ఎన్ని చేపలు అక్వేరియంలో ఉంచాలి. అంతే కాకుండా ఏ ఏ రంగుల చేపలను అందులో పెంచాలనే విషయాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



**ప్రతికూల శక్తులు దూరమవుతాయ్:**

నిజానికి మీ జీవితంలో సానుకూల ప్రభావాన్ని తీసుకురాగల శక్తి చేపలకు ఉంటుంది. ఇవి అన్ని ప్రతికూల శక్తిని గ్రహించి మిమ్మల్ని రక్షిస్తాయి. వాస్తు శాస్త్రం ప్రకారం, మీ ఇంట్లో చేపల అక్వేరియం ఉంటే, అందులో 9 చేపలు ఉండాలి. ఒక నల్ల చేప, మరో ఎనిమిది బంగారు చేపలు ఉండాలి. బంగారు చేపలను శుభానికి చిహ్నంగా భావిస్తారు. ఇదే కాకుండా, వాస్తు శాస్త్రం ప్రకారం, అరోవానా చేప కూడా చాలా పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. అరోవానా చేప ఇంట్లోకి ఆనందం, శ్రేయస్సు, సంపదతో పాటు మంచి ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. అరోవానా చేపలను ఇంట్లో ఉంచడం వల్ల ప్రతికూల శక్తులు తొలగిపోయి ఇంట్లో సానుకూల శక్తిని నింపుతుంది.

**అరోవానా చేప విగ్రహం:**

చాలా మంది ఇంట్లో అక్వేరియం ఉంచకూడదనుకుంటారు.అటువంటి పరిస్థితిలో మీరు అరోవానా చేపల విగ్రహాన్ని కూడా ఉంచుకోవచ్చు. అరోవానా చేప విగ్రహాన్ని ఇంట్లో ఈశాన్య లేదా తూర్పు దిశలో ఉంచండి. ఇది ఇంటికి ఆనందం , సంపదను కూడా తెస్తుంది. నోటిలో నాణెం ఉన్న అరోవానా చేప విగ్రహం చాలా పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గాని సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

## పండిత, పామరుల చెవులూరించిన వయోలిన్ విద్వాంసుడు, ఆదర్శగురువు

# 'సంగీతానంద' శ్రీ నేతి శ్రీరామశర్మ



(గతవారం తరువాయి)

వయోలిన్ కన్నా, గాత్రం కన్నా వీరు ఎక్కువగా ప్రేమించేది బోధనా వృత్తి. తమ గురువులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారిలా బోధన పట్ల అంకితభావంతో నిమగ్నమైన గొప్ప గురువు శ్రీరామ శర్మ. వీరి వద్ద శిక్షణ పొంది ఆకాశవాణి పోటీలలో అవార్డులు, బహుమతులు అందుకున్న యు-వతీయువకులు, శిష్యగణం ఎందరో ఉన్నారు. ప్రఖ్యాత విదుషీమణి శ్రీమతి బి. ఇందిరా కామేశ్వరరావు, శ్రీమతులు వేదవతి ప్రభాకర్, నృత్య చూడామణి శోభానాయుడు, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, డాక్టర్ వై. రమాప్రభ, కె. శేషు బాయి, చిద్రూపలక్ష్మి, చంద్రభాను, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, మహాలక్ష్మి, స్వప్న, శ్వేతా ప్రసాద్, అంజనా సుధాకర్, డాక్టర్ కుప్పా శారద, ప్రత్యూష హరి, కామేశ్వరి, నిర్మల, కస్తూరి, దేవసేన, శృతి చిలకమర్రి లావణ్య, శిరీష బీ శ్రీయుతులు చంద్రశేఖర్, పలకా శ్రీనివాస్ , పి. రమేష్, ఆదిత్య, రవి గణేష్, సినీ నేపథ్య గాయకులు నేమాని పార్థసారథి, నిహాల్, వినయ్ రాహుల్ తదితరులు శ్రీరామశర్మ శిష్యగణమే.

అపారమైన శిష్య సంపద కలిగిన శ్రీరామశర్మ గారికి 2000 సంవత్సరములో హైదరాబాదు భాగ్యనగరంలో పుష్పగిరి పీఠాధిపతులైన శ్రీ శ్రీ శ్రీ నృసింహ భారతీస్వామి వారి దివ్య ఆశీస్సులతో, సంగీత శ్రేష్ఠులైన సర్వశ్రీ అన్నవరపు రామస్వామి, నూకల చిన సత్యనారాయణ, ఎల్లా వెంకటేశ్వరరావు వంటి ప్రముఖుల సమక్షంలో డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి ఆధ్వర్యంలో శ్రీరామశర్మ గారి శిష్య ప్రశిష్యులు గురువులకు చేసిన విశిష్టమైన సువర్ణఘంటా కంకణ ప్రదాన – కనకాభిషేక మహోత్సవము మరియు 'సంగీతానంద' బిరుదు ప్రదానము చరిత్రపుటల్లో ఒక మైలురాయిగా నిలిచి పోయింది. బహుశా భాగ్యనగరంలో ఇంతకుముందు ఏ గురువులకు శిష్యులు ఇటువంటి ఘనసత్కారం జరుపలేదనటం అతిశయోక్తిగాదు.

2000 సంవత్సరములో శ్రీరామశర్మ గారికి శిష్యులు జరిపిన సువర్ణఘంటా కంకణ ప్రదాన – కనకాభిషేక మహోత్సవము మరియు తదనంతరం – శ్రీరామశర్మ గారికి సమకాలీకులైన కొంతమంది సంగీత ప్రముఖులు, శ్రేయోభిలాషులు మరియు శిష్యులు శర్మగారితో వారికున్న అనుబంధాన్ని, సాన్నిహిత్యాన్ని తెలియచేసిన ఆహ్లాదకరమైన విషయాలు కొన్నిటిని క్రింద ఉదహరించటమైనది.

శ్రీరామశర్మ సహాధ్యాయి అయిన పద్మ విభూషణ్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు శ్రీరామశర్మ గురించి ప్రస్తావిస్తూ "విశిష్టమైన వ్యక్తిత్వం గలవాడని, 60 సంవత్సరములుగా మేము కలసిమెలసి మసలుకొనుచున్నామనీ శ్రీరామశర్మకి పెద్దల యందు గౌరవము, మంచిని గ్రహించుట, నిష్కళంకమైన స్నేహభావం, సహనము, తృప్తి, విలక్షణమైన మనుగడ కలిగి అందరికీ సంతోషం కల్గించుచూ ఆనందమైన జీవనము గడుపుట వంటి సలక్షణములు ఇతనిని వరించినవనీ జంతగాత్రములలో ఆరితేరినవాడని, మంచి గురువుగా అనేకమందికి విద్యాబిక్షను ప్రసాదిస్తున్నవాడనీ ఆకాశవాణిలో మచ్చలేని నిలయ విద్వాంసునిగా పేరు గడించినవాడని, శర్మతో గడుపు సమయం తనకెంతో హాయిని, ప్రశాంతతను, మనోల్లాసమును కలిగించేదనీ అహంకారము లేదని, ఇతరులను నొప్పించేవాడు కాదని, చిరునగవు మోముతో, చమత్కారముతో మితభాషణము చేసేవాడనీ మంచికి మారుపేరుగా నిలిచిన మహామనీషి అని' కొనియాడారు.



'నాదసుధార్ణవ' పద్మశ్రీ అన్నవరపు రామస్వామి గారి మాటల్లో (ఆ రోజులలో పంతులుగారి వద్ద విద్య నేర్చుకొనే అందరూ వీరిని 'అన్న రామస్వామి' అని సంబోధించే వారు) "స. ప. స. లు, అనగా మొదటి నుంచీ మా ఇద్దరి గురువర్యులైన బ్రహ్మశ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి వద్ద నేర్చుకుంటూ, మా అయ్యవారి వద్ద పాఠం చెప్పుకొని నా వద్ద సాధన చేస్తూ ఉండేవాడనీ సహజమైన గాత్రం, సూక్ష్మ గ్రాహ్యత కలిగిన శ్రీరామశర్మ గురువుగారు పాఠం చెప్పగానే గ్రహించేవాడనీ వయోలిన్ వాద్యం లోను మంచి దిట్టయని, ఎటువంటి క్లిష్టమైన సంగతినైనా చాలా సునాయాసముగా పాడటమే గాకుండా వయోలిన్ పై కూడా చాలా సుళువుగా పలికించేవాడనీ ఆకాశవాణి నిలయ విద్వాంసునిగా డాక్టర్ బాలమురళీకృష్ణ వంటి మేధావులకు రాగం, తానం, పల్లవి ప్రోగ్రామ్స్ వాయులీన సహకారం అందించడంతో పాటు, గాత్ర కచేరీలు, సంగీత శిక్షణ .... ఒకటేమిటి అనేక రేడియో కార్యక్రమాలలో పాల్గొని ఆకాశవాణిలోనే కాక దూరదర్శన్ కార్యక్రమాలలోనూ, దేశం నలుమూలల అనేక సభలలో పాల్గొని సంగీత ప్రపంచానికి ఎనలేని పేరు ప్రతిష్టలను అందించడంతో పాటు గురువుగా అనేకమంది శిష్యులను తయారుచేసాడనీ నిగర్వి, ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాడని .... ఒక్క మాటలో చెప్పాలంటే అజాతశత్రువు అని" వక్కాణించారు.



'సంగీత కళానిధి' శ్రీ నేదునూరి కృష్ణమూర్తి గారు ఒకానొక సందర్భములో శ్రీరామశర్మ గారి గురించి ప్రస్తావిస్తూ "పంచుకొన్నకొద్దీ పెరిగే ఆస్తులు విద్య, ఆనందం! నిత్యనూతనోత్సాహముతో తానుంటూ తన పరిసరాన్ని కూడా ఉత్సాహ, చైతన్యాలతో గుబాళింప చేయగలిగిన సరసహృదయుడనీ ఉద్యోగ విరమణానంతరం కూడా నిర్విరామంగా సంగీత వ్యాసంగంతో పదిమందికి సంగీత జ్ఞానాన్ని పంచిపెడుతూ ఒక ఉత్తమ గురుపీఠంగా గౌరవాదులు పొందుతున్న ధన్యుడు శ్రీరామశర్మ" అని అభివర్ణించారు.

'మహామహోపాధ్యాయ' శ్రీ నూకల చిన సత్యనారాయణ గారు "శ్రీరామశర్మ గొప్ప సంగీత విద్వాంసుడని, సంప్రదాయబద్ధమైన శైలి, మంచి గాత్రం, మధురమైన పలుకుతోపాటు మంచి గాత్ర విద్వాంసుడనీ వీరి పాట నేతి మిఠాయి వలే ఉండుననీ అనేక సంగీత సభలలో గొప్ప విద్వాంసుల నుండి చిన్న చిన్న కళాకారుల దాకా వయోలిన్ సహకారం అనేక దశాబ్దాలు కొన్ని వందల మందికి ఎన్నో సభలలో, ప్రదేశములలో వాయించి రసికుల మన్ననలు పొందిన శ్రీరామశర్మ ఆదర్శప్రాయమైన సద్గురువనీ వందలాది శిష్యులకు బోధన చేసి, మంచి విద్వాంసులుగా రూపొందిన మహామనీషియనీ తన గృహం ఒక సంగీత క్షేత్రముగా చేసుకొని సంగీత వ్యవసాయాన్ని చేసి దివ్యమైన సంగీత పంటను పండించి సంగీత భోజనాన్ని సంగీత రసికులకు అందించిన సహృదయుడనీ శ్రీరాముడుగా నీలమేఘచ్ఛాయతో ఆప్యాయంగా, మధురంగా మాట్లాడుతాడనీ లక్ష్మి సరస్వతి వీరి ఇంట అత్తా కోడలుగా కలిసిమెలసి (లక్ష్మీ సరస్వతి సహజీవనం చేసినట్లుగా) ఉంటున్నారనీ నేతివారి గృహం "ఇందిరా శారదానిలయమని" కొనియాడారు.



ప్రముఖ మార్దంగికులు పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరావు గారు శ్రీరామశర్మ గురించి ప్రస్తావిస్తూ "నా ఏడవ సంవత్సరం కచేరీ ప్రారంభం నుండి నాయందు ప్రేమానురాగాలు చూపుతుండేవారనీ సౌజన్యమూర్తి ,సంగీత కళాతపస్వియనీ ఒక వ్యక్త్యి సాధారణంగా ఒకే విద్యలో ప్రావీణ్యత కలిగియుండవచ్చుని, సవ్యసాచి అనే సార్థక నామం కలిగిన అర్జునివలె శ్రీరామశర్మ అంత్యంత ప్రతిభావంతునిగా ఖ్యాతి పొందినవారనీ ఒక కళాకారుని వలన సంస్థకి, సంస్థ వలన కళాకారునికి అవినాభావ సంబంధాలతో విలసిల్లి అత్యంత కీర్తి ప్రతిష్టలు తెచ్చుకున్నారనీ మేమిద్దరమూ సోదరులవలె ఆకాశవాణిలో 35 సం.లు కలసి పనిచేశామని, ఆకాశవాణిలో బాలానందం, స్త్రీల, యువజన, కార్మిక, జానపద, నాటికలు, నాటకాలు, రాగం తానం పల్లవి ఇత్యాది కార్యక్రమములలో మేమిద్దరమూ కావాలని కార్యక్రమ నిర్దేశకులు, దర్శకులు కోరుకొనేవారనీ మంచి సద్గురువుగా కీర్తిని ఆర్జించి తన జన్మను సార్థకం చేసుకొన్నారని" ప్రశంసించారు.

శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారు, సంగీత దర్శకులు, గీత రచయిత శర్మగారిని ప్రశంసిస్తూ "భగీరథుడు గంగను భూమిపైకి తీసుకువచ్చినట్లు సుసర్ల దక్షిణామూర్తిగారు దక్షిణాది నుంచి త్యాగరాజస్వామి సంగీత సంప్రదాయాన్ని కొనితెచ్చి ఆంధ్రదేశమునకు అందించగాబీ వారి ప్రియశిష్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారు వారి గురువుల అడుగు జాడల్లో తయారు చేసిన శిష్యులలో శ్రీరామశర్మ ఒకరనీ సంగీతాన్ని అంగడిలో దొరికే వ్యాపార వస్తువుగా మార్చకుండా, లౌకిక ప్రపంచ ఆకర్షణలకు ప్రలోభాలకు లొంగిపోక, సంగీత విద్యావ్యాప్తియే జీవిత మహదాశయంగా గురుకటాక్ష బలంతో ఎంతోమంది శిష్యులను తయారుచేశారనీ శర్మగారు సంపాదించుకున్న శిష్య సంపద మరే విద్వాంసుడు సంపాదించుకోలేదేమోయని" కొనియాడారు.

శ్రీ లాల్గుడి జి. జయరామన్ గారు శ్రీరామశర్మ గారిని మొదటసారి 1951లో విజయవాడలో కలుసుకొన్నారు. నాటినుండి వారిద్దరి మధ్య సాన్నిహిత్యం ఉంది.

(మిగతా వచ్చేవారం)



- యనమండ్ర వేంకట కృష్ణయ్య
9849986679



(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com




# 24.11.2024 నుంచి 30.11.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలోకుటుంబ ఆదాయము కొంతవరకు తగ్గుముఖం పట్టడం వల్ల, జీవిత భాగస్వామి అభివృద్ధి విషయాలలో కొంత అసంతృప్తి ఉంటుంది. ఆలోచనలు అధికము గా చేస్తారు. వృత్తికి సంబంధించిన విషయాలలో మీరు తీసుకునే నిర్ణయాలు చాలావరకు అనుకూలంగా ఉంటాయి. వ్యాపార పెట్టు బడుల కొరకు, సంతాన అభివృద్ధి కొరకు స్థిర పెట్టుబడుల కొరకు కుటుంబంలోని వ్యక్తులతో భాగస్వామితో చర్చించి తగిన ప్రయత్నాలు చేస్తారు. భాగస్వామికి సంఘంలో గుర్తింపు గౌరవం విషయంలో ఘర్షణాత్మకంగా ఉంటుంది. దానివల్ల మీ ఆత్మవిశ్వాసంకొంతశాతము తక్కువగాఉంటుంది.వ్యాపారాన్నిఅభివృద్ధిపరిచే విషయాలలో, నూతన వ్యక్తులకి వృత్తిపరమైన అవకాశాలు కల్పించడం లోనూ కొంత జాప్యము ఉంటుంది.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో తల్లితండ్రుల యొక్క సౌకర్యాలు కల్పించడంలో ముందుంటారు. అయినప్పటికీ వారితో అభిప్రాయ వేదాలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలి. గృహవాతావరణం చికాకులుగా ఉంటాయి. గృహం మీద శ్రద్ధ ఎక్కువ తీసుకోవడం, స్థిరాస్తుల గురించి చర్చలు, నూతన పెట్టుబడుల కొరకు ఆలోచనలు అధికం చేస్తారు. విద్యార్థులకు విద్యాపరమైన విషయాలలో చికాకులు ఆటంకాలు ఎదురైనప్పటికీ కృషితో వాటిని అధిగమించే దిశగా ప్రయత్నాలు చేయాలి. వాహన సౌఖ్యం తక్కువగా ఉంటుంది. తల్లి ఆరోగ్యము అనుకూలంగా ఉంటుంది. స్థిరాసుల విషయంలో, వారసత్వపు ఆస్తుల విషయంలోజీవిత భాగస్వామిసంతానంతోచర్చించికొత్తనిర్ణయాలుతీసుకుంటారు .అనవసర ఖర్చులకు వృధా శ్రమకు దూరంగా ఉండాలి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ఎక్కడికక్కడ అపార్థాలకు దూరంగా ఉండాలి.కోపతాపాలకు దూరంగా ఉండాలి. మిత్రులతో చర్చించుకుని నిర్ణయాలు తీసుకుంటారు అవి భవిష్యత్తుకు ఉపయోగకరంగా ఉంటాయి. సేవకుల సహకారం అనుకూలంగా ఉంటుంది ఆశించిన ఫలితాలు పొందుతారు. కమ్యూనికేషన్ బాగుంటుంది దగ్గర ప్రయాణాలు చేస్తారు సంప్రదించుకున్న నిర్ణయాలు తీసుకుంటారు లో అభిప్రాయబదాలు ఘర్షణ రాకుండా వీలైతే జాగ్రత్త వహించాలి సంతాన అభివృద్ధి మిత్రులతో సంప్రదించి తీసుకునే నిర్ణయాల వల్ల సంతానంతో అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. కుటుంబంలోని స్త్రీల ఆరోగ్య విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తగిన విధముగా ఖర్చు చేస్తారు



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోచిన్న చిన్న విషయాలకి కోపోద్రేకానికి లోను కాకుండా శాంతాన్ని అలవర్చుకుంటే సమస్యల్ని దాటటం సులువు అవుతుంది. ఆర్థిక విషయాలనుకూలంగా , కుటుంబ వాతావరణం సామరస్యంగా ఉంటుంది. వాగ్దానాలను అమలు చేస్తారు.జీవిత భాగస్వామితో కలిపి చర్చించి ఒక చక్కని నిర్ణయానికి వస్తారు భాగస్వామ్య వ్యవహారాలలో, వివాహ సంబంధ విషయాలలో చాలావరకు మిశ్రమ ఫలితాలు ఉన్నప్పటికీ అనుకూలంగా ఉంటుంది. వారం మధ్యలో మిత్రులను కలుస్తారు మంచి నిర్ణయాలు తీసుకుంటారు, దగ్గర ప్రయాణాలు చేస్తారు . క్రీడాకారులకు అనుకూలంగా ఉంటుంది. వారం చివరిలో తల్లి ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకుంటారు. స్థిరాస్తుల కొరకు అధికంగా ప్రయత్నం చేస్తారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలోస్వశక్తి మీద నమ్మకంతో గట్టిగా కృషి చేసి ఫలితాలను సాధిస్తారు శ్రమతో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని కఠినంగా శ్రమించి అనుకున్నదిశగా చేసే ప్రయత్నాలు చాల వరకు మీకు అనుకూలంగా ఉంటాయి. పోటీలలో నెగ్గుతారు రోగ నిరోధక శక్తిని పెంచుకునే దిశగా ప్రయత్నాలు చేస్తారు నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. తల్లి వైపు బంధువులతో జగడములు రాకుండా నెమ్మదిగా చర్చించి ఆలోచించి సమస్యల్ని పరిష్కరించుకోవాలి. ముఖ్యమైన పనులను వాయిదా వేయకుండా బద్ధకించకుండా ముందుకు వెళితే ఫలితాలు వస్తాయి. మాటలను కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి. వారం చివరిలోమళ్ళి ఇంతకుముందు మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన వ్యక్తులే మీకు వారి సహకారాన్ని అందిస్తారు



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలోసంతాన సంబంధమైన విషయాలలో, వారికి సంబంధించిన పెట్టుబడుల కొరకు ప్రయత్నాలు అధికంగా చేస్తారు. వాటిని అధిగమించడానికి యోగా మెడిటేషన్ మొదలైన సహకరిస్తాయిఆత్మీయులను వ్యక్తుల కొరకు అధికంగా ఖర్చులు చేస్తారు. ఆధ్యాత్మిక విషయాలలో ఉపాసన బలాన్ని పెంచుకునే దిశగా ప్రయాణాలు తగిన ఖర్చులు కూడా చేస్తారు. మానసిక ప్రశాంతత తక్కువగా ఉంటుంది ఉద్వేగాలు అధికంగా ఉంటాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. నూతన ప్రదేశాలకు ప్రయాణాలు చేయడం కొరకు ఆహ్వానాల అందుకోవటంతో పాటు ఆసక్తిని కనబరుస్తారు, ప్రియ-ంమైన వ్యక్తులతో అభిప్రాయ బెదములు రాకుండా జాగ్రత్త వహించాలి. వారం చివరిలో. మీ సలహా కొరకు వ్యక్తులు మిమ్మల్ని సంప్రదిస్తారు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోస్థిరాస్తులను విస్తరింప చేయడానికి ఆలోచనలు,చర్చలుఅనుకూలంగాఉంటాయి.ఆశించిన వార్తలు అందుకుంటారు. గృహ వాతావరణం అనుకూలంగా ఉంటుంది వాహన లాభం. విద్యార్థులకు అనుకూల ఫలితాలు.తల్లిఆరోగ్యంబాగుంటుంది.నూతనపరిచయాలు సంఘంలో గుర్తింపు గౌరవం, భాగస్వామితో కలిసి అనుకూలంగా చర్చలు జరిపి వారి వృత్తి కొరకు సహకారం అందిస్తారు. వ్యక్తిగత నిర్ణయాలు కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ పట్టుదలతో అనుకున్న పనులు నెరవేర్చుకోవడానికి ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ ముందుకు వెళతారు. మధ్యలో వృధా ప్రయాణాలు, ఆకస్మిక ఖర్చులు జాగ్రత్తలు తీసుకోవాలి. గృహ నిర్మాణ విషయంలో ఆలోచనల అధికమవుతాయి.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

ప్రారంభంలోవృత్తి చేయు స్థలము నందు కొలీగ్స్ అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జీవిత భాగస్వామికి దూర ప్రదేశాలలో వృత్తిపరమైన మార్పులు.వృత్తిలో అధిక బాధ్యతలు ఉన్నప్పటికీ మిత్రుల సహకారంతో పనులను సులభంగా నెరవేర్చుకో గలుగుతారు. నిరుద్యోగులైన తోబుట్టువులకు నూతన ఉద్యోగ అవకాశాలు మీ సహకారంతో నెరవేరుతాయి.వ్యాపారభాగస్వాములతో ఆర్థిక అంశాలలో అపార్థాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దూర ప్రదేశాల్లో ఉండే చిన్ననాటి మిత్రులు విదేశీ వ్యవహారాల్లో ఆర్థిక అభివృద్ధి. ప్రియమైన మిత్రులు తోబుట్టువులు కొరకు ఖర్చులు అధికంగా చేస్తారు. నూతన వృత్తులు కొరకు ప్రయత్నం చేసే వారికి విదేశీ అవకాశాలు. దూర ప్రయాణాలకు అవకాశాలు. ఇంకా మంచి ఫలితాల కొరకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన మంచిది



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాడ 1వ పాదము

వారం ప్రారంభంలోతండ్రి గురువుల ఆశీస్సులు లభిస్తాయి. ఆధ్యాత్మిక అంశాలలో ఆకస్మిక వాయిదాలు చికాకును కలిగిస్తాయి. దూర ప్రయాణాల కొరకు చేసే ప్రయత్నాలు కొంత అసంతృప్తి అశాంతిని కలిగించినప్పటికీ పుణ్యఫలాన్ని పెంచుకునే దిశగా మీరు చేసే ప్రయత్నాలు మీకు సహకారాన్ని ఇస్తాయి. మాటల వల్ల ఉద్వేగాలు అభిప్రాయ బేధాలు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. కుటుంబ వాతావరణం కొంచెం ఘర్షణాత్మకంగా ఉంటుంది వారసత్వ ఆస్తుల గురించి చర్చలు జరుగుతాయి.ఆర్థిక అంశాలు అనుకూలంగా ఉంటాయి. మధ్యలో ఆర్థిక అంశాలు అనుకూలంగా ఉంటాయి, వృత్తిపరమైన అదనపు ఆదాయం లభ్యమవుతుంది. సంతానానికి సంబంధించిన విషయాలు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయి ఎదురుచూస్తున్న వార్తలు అందుకుంటారు



## మకర రాశి

ఉత్తరషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంవిపరీతమైన ఉద్వేగాలను కోపాలని కంట్రోల్ చేసుకోవాలి. ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ జాగ్ర త్తలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలి. భాగస్వామ్య వ్యవహారాల్లో, జీవిత భాగస్వామితో అభిప్రాయ భేదములు రాకుండా వీలైతే జాగ్రత్తగా మసులుకోవాలి. చాలా ఉద్వేగం గా ఆలోచనలు చేస్తారు. పనులు తాత్కాలికంగా వాయిదా పడి మనసుకి చికాకును కలిగిస్తాయి మానసిక ఘర్షణ ఒత్తి డి అధికంగా ఉంటుంది. అనవసర విషయాల లో జగ డములకు దూరంగా ఉండాలి మౌనం వహించడం మంచిది. వారం మధ్యలో దూర ప్రయాణాలు కొరకు తీసుకునే నిర్ణయాలు పూర్తి సంతృప్తిని కలుగ చేయవు. నూతన అవకాశాలు వచ్చినప్పటికీ వాటి విషయంలో కీలక నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచనలు వాయిదా వేస్తారు.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోజీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తారు. జీవిత భాగస్వామితో కలిసి నూతన ప్రదేశాలు సందర్శన కొరకు, వారికి బహుమతుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయికొత్త పరిచయాలు, సంఘంలో గుర్తింపు గౌరవం, ప్రదేశాలు సందర్శన. రోగ నిరోధక శక్తి పెరు గుతుంది. వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటారు. . వారం మధ్యలో అనవసర ఖర్చులు అధికంగా ఉంటాయి ముఖ్యమైన విషయాలు తాత్కాలికంగా వాయిదా పడతాయి ప్రణాళిక లేని ఖర్చుల వల్ల మనసు ఘర్షణ అధికంగా ఉంటుంది. దూర ప్రయాణంలో కొరకు ,తండ్రి ఆరోగ్యం కొరకు, ఖర్చులు అధికంగా చేస్తారు. అసంతృప్తిని అధిగమించే విధంగా పుణ్య బలాన్ని పెంచుకునే దిశగా ఆలోచన చేయాలి. మోసములకు లొంగిపోకుండా ఆత్మీయులను సంప్రదించి నిర్ణయాలు



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలోదూర ప్రదేశాల నుంచి సంతానానికి సంబంధించిన విషయాలలో ఆశించిన సమాచారాన్ని అందుకుంటారు.శత్రువుల మీద విజయం సాధిస్తారు , మీ యొక్క అభివృద్ధి అంశాలలో తోబుట్టువుల సహకారం ఉంటుంది. మిత్రులతో జగడాలు వాగ్వాదాలు రాకుండా జాగ్రత్తగా ఉండాలి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది న్యాయపరమైన విషయాలు మీకు అనుకూలంగా ఉంటాయి. బంధుమిత్రులతో అనుకూలంగా ఉంటుంది. సంతానానికి అభివృద్ధికరంగా ఉంటుంది పోటీల్లో నెగ్గుతారు. నూతన పరిచయాలు ఏర్పడతాయి మిత్రుల సహకారం అనుకూలంగా ఉంటుంది దూర ప్రదేశాలకు ఆహ్వానాలు అందుకుంటారు. ముఖ్యమైన విషయాలుతాత్కాలికంగా వాయిదా

నందిత కవిటి

